

ప్రజావీక్షణం
దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :331 26 సోమవారం అక్టోబర్ 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

సామాన్యుల కృషికి వందనం చేయడమే

'మన్ కీ బాత్'..

ఇది ఒక తీర్థయాత్ర లాంటిది: 12 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని మోదీ




తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రయాణం తనకు ఒక 'తీర్థయాత్ర' లాంటిదని, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సామాన్యులు చేస్తున్న అసాధారణమైన కృషిని గౌరవించుకునే మార్గమని ఆయన అభివర్ణించారు.నేడు ప్రసారమైన 139వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో మాట్లాడుతూ, ఈ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచి, స్ఫూర్తినిచ్చిన శ్రోతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు."పన్నెండేళ్ల క్రితం, విజయదశమి పర్వదినాన మనం 'మన్ కీ బాత్' ప్రారంభించాం. అప్పటి నుంచి మన ప్రయాణం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ ప్రయాణంలో మీరంతా సహ ప్రయాణికులుగా, స్ఫూర్తిదాతలుగా ఉన్నారు. శతాబ్దాలుగా మన దేశంలో తీర్థయాత్రల సంప్రదాయం ఉంది. ...మిగతా 2 లో...

మక్కాపై దాడి చేయలేదు..

సౌదీ చమురు క్షేత్రాలే మా లక్ష్యం: హౌతీ రెబల్స్

ఇస్లాం పవిత్ర నగరాలైన మక్కా మదీనాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామన్న వార్తలను యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు ఖండించారు. తమ లక్ష్యం కేవలం సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, సైనిక స్థావరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. మరోవైపు, మక్కా మదీనా ప్రాంతాల దిశగా ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నామని, వాటి శకలాలు కింద పడ్డాయని సౌదీ అరేబియా ప్రకటించింది.శనివారం సౌదీ దళాలు రెండు బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేశాయి.ఈ క్రమంలో మక్కా సమీపంతో పాటు జెద్దా, తాయిఫ్, రబీఖ్ ప్రాంతాల్లో క్షిపణి శకలాలు పడ్డాయని సౌదీ సివిల్ డిఫెన్స్ విభాగం తెలిపింది.
...మిగతా 2 లో...

భారత్-పాక్ మ్యాచ్‌లు క్రీడ కాదు.. రాజకీయ వ్యవహారం:



-క్రీడల్లోకి రాజకీయాలు ప్రవేశించాయన్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్

-గతంలో సంబంధాల మెరుగుకు వాడిన క్రికెట్‌ను ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శ

-పాక్ ఆటగాళ్లతో కరచాలనం చేయకపోవడాన్ని తప్పుబట్టిన థరూర్

-కార్గిల్ యుద్ధ సమయంలోనూ పాక్‌తో ఆడామని గుర్తుచేసిన కాంగ్రెస్ ఎంపీ

భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్‌లను ఇప్పుడు క్రీడా పోటీలుగా కాకుండా, రెండు దేశాల మధ్య ఓ రాజకీయ వ్యవహారంగా చూస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల మధ్య క్రికెట్‌లో రాజకీయాలు ఎంతగా పెరిగిపోయాయో ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ముంబైలో జరిగిన లిట్‌ఫెస్ట్‌లో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు."క్రికెట్‌ను రాజకీయాలకు, రాజకీయాలను క్రికెట్‌కు దూరంగా ఉంచడం అనేది జరగలేదు. క్రికెట్ ఇప్పుడు రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. అందుకే రాజకీయ సంబంధాలు ఉన్న వ్యక్తులే క్రికెట్ పాలనలో ఎక్కువగా కనిపిస్తున్నారు" అని థరూర్ విశ్లేషించారు. గతాన్ని గుర్తుచేస్తూ, ఒకప్పుడు ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచడానికి నాయకులు క్రికెట్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకునేవారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. చాలా అరుదుగా మ్యాచ్‌లు ఆడుతుండటంతో, ఎప్పుడు ఆడినా రాజకీయాలు తెరపైకి వచ్చి, మ్యాచ్‌కు జాతీయ స్థాయిలో భారీ ప్రాధాన్యం లభిస్తోందని ఆయన వివరించారు. మిగతా 2 లో

రాహుల్‌గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారింది



రాహుల్ గాంధీ భారతదేశంలోనే అతిపెద్ద అబద్ధాలకోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు ఖైరతాబాద్ యువ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిబ్రాన్ షరీఫ్‌కు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 2023 ఎన్నికలకు ముందు తెలంగాణలో గెలిచేందుకు రాహుల్ గాంధీ 420 వాగ్దానాలు చేశారు. వీటిలో 6 గ్యారంటీలు, 13 డిక్లరేషన్లున్నాయి.. వీటిని 100 రోజుల్లోగా నెరవేర్చాల్సి ఉంది.. కానీ 1,000 రోజులు గడిచినా ఒక్క వాగ్దానం కూడా నెరవేరలేదన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రజల ముందు రావడానికి భయపడుతున్నారన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం రాహుల్ గాంధీ ఒక ఏటీఎం లాగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి ఒక కార్డులాగా పనిచేస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ ప్రజల సొమ్మును దోచుకుంటోందని, రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, కార్తకర్తలు, పార్టీ శ్రేణులు

ట్రంప్‌పై ఒబామా తీవ్ర విమర్శలు..

అది మోసపూరిత పాలన అంటూ ఫైర్

- ఒహాయో ర్యాలీలో ట్రంప్‌పై తీవ్రంగా విరుచుకుపడిన ఒబామా
- ఇరాన్‌తో అనవసర యుద్ధాన్ని ట్రంప్ ప్రారంభించారని ఆరోపణ
- సుంకాల వల్ల వినియోగదారులపైనే భారమన్న మాజీ అధ్యక్షుడు
- స్వప్రయోజనాల కోసమే ట్రంప్ అధ్యక్ష పదవిని వాడుకుంటున్నారని విమర్శ
- నవంబర్ 3 మధ్యంతర ఎన్నికలే చివరి అవకాశమని వ్యాఖ్య

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం ఒహాయోలోని క్లీవ్‌ల్యాండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా ఇరాన్‌తో ఉద్రిక్తతలు, సుంకాల విధింపు, అధ్యక్ష పదవిని స్వప్రయోజనాలకు వాడుకోవడం వంటి అంశాలపై ఒబామా తీవ్ర ఆరోపణలు చేశారు.



...మిగతా 2 లో...



కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్:

అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

- కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష
- నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం
- కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన
- అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి
- హైదరాబాద్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. మిగతా 2 లో

అమెరికా, ఇజ్రాయెల్ మాకు నష్టపరిహారం చెల్లించాలి:

ఇరాన్ సుప్రీం లీడర్ డిమాండ్



-న్యాయవ్యవస్థ చీఫ్‌తో మోజ్తబా ఖమేనీ భేటీ


-దేశానికి కలిగించిన నష్టానికి తగిన పరిహారం రాబట్టేందుకు కృషి చేయాలని ఆదేశం

-ఇరాన్ హక్కులను కాపాడటంలో రాజీ పడొద్దని సూచన

-ఇరాన్‌పై మళ్లీ 'ఎపిక్ ఫ్యూరీ' తప్పదని ట్రంప్ హెచ్చరిక

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఓవైపు, తమ దేశంపై అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడులకు నష్టపరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేయగా, మరోవైపు ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్య చేపట్టే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. మిగతా 2 లో

విశాఖకు 870 కి.మీ దూరంలో తీవ్ర వాయుగుండం..



-బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం

-దశలవారీగా బలపడి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం

-అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే సూచన

-గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని అంచనా

-మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ప్రభుత్వం హెచ్చరిక

ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది దశలవారీగా బలపడి "అతి తీవ్ర తుపాను"గా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొచ్చే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 28వ తేదీ ఉదయం బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే సూచనలు ఉన్నాయని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలకు ఆరెంజ్ మెసేజ్ జారీ చేసింది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీచే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం ఉదయం 11:30 గంటల సమయానికి ఈ తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 870 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 960 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. మిగతా 2 లో

ఇండియా బ్లాక్ ర్యాలీతో మాకు సంబంధం లేదు..



నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ సహా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ర్యాలీతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎంఐఎం పార్టీ చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. తాజా రాజకీయ పరిణామాలపై అసదుద్దీన్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై స్పందించారు. ఇండియా బ్లాక్ ర్యాలీతో మాకు ఎలాంటి సంబంధం లేదు. . నేను సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నా. అందుకోసమే కోర్టులో కేసు వేశా. సర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై ప్రశ్నించాను.సీఈసీని నియమించడం దగ్గరి నుంచి సీఈసీకి చట్టపరమైన రక్షణ కల్పించడానికి కూడా నేను వ్యతిరేకం. అయితే, దీనికోసమే ఇండియా బ్లాక్ కూటమి చేపడుతున్న ర్యాలీతో మాకు ఎలాంటి సంబంధం లేదు అన్నారు. మిగతా 2 లో

ప్రజావీక్షణం
దినపత్రిక

భారత్-పాక్ మ్యాచ్‌లు క్రీడ కాదు.. రాజకీయ వ్యవహారం: శశి థరూర్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఆసియా కప్ వంటి టోర్నీల్లో పాకిస్తాన్ ఆటగాళ్లతో భారత ఆటగాళ్లు కరచాలనం చేయకపోవడాన్ని తాను గతంలోనే విమర్శించిన విషయాన్ని థరూర్ మరోసారి గుర్తుచేశారు. ఆ విధానంలో అర్థం లేదని తాను వాదించినట్లు తెలిపారు. 1999లో కార్గిల్ యుద్ధం జరుగుతున్న సమయంలో కూడా భారత్, పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడిందని ఆయన ప్రస్తావించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ పట్ల మెతక వైఖరి అవలంబిస్తోందని బీజేపీ ఆరోపించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

అమెరికా, ఇజ్రాయెల్ మాకు నష్టపరిహారం చెల్లించాలి: ఇరాన్ సుప్రీం లీడర్ డిమాండ్

మొదటిపేజీ తరువాయి

శనివారం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ, దేశ న్యాయవ్యవస్థ చీఫ్ ఘోలమ్‌హెస్సేన్ మొహ్సేనీ-ఎజెయితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖమేనీ మాట్లాడుతూ.. అమెరికా-ఇజ్రాయెల్ నేరగాళ్లు తమ దేశానికి కలిగించిన భౌతిక, ఇతర నష్టాలకు తగిన పరిహారం రాబట్టేందుకు తీవ్రంగా కృషి చేయాలని ఆదేశించారు. ఇరాన్ ప్రజల హక్కులను కాపాడటంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అవినీతి నిర్మూలన, న్యాయ వ్యవస్థలో సంస్కరణలు వంటి అంశాలపై కూడా చర్చించారు.మరోవైపు, శుక్రవారం ఫ్లోరిడాలో జరిగిన ఓ ర్యాలీలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఇప్పుడు ఇరాన్ పెద్దగా ఏమీ చేయలేని స్థితిలో ఉంది. మేం తలుచుకుంటే, వాళ్ల ఆయిల్ మొత్తాన్ని స్వాధీనం చేసుకోగలం. లేదా మొత్తం దేశాన్నే మా ఆధీనంలోకి తీసుకోగలం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా "ఎపిక్ ఫ్యూరీ" పేరుతో భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభించిన విషయాన్ని ట్రంప్ గుర్తుచేశారు. "మరో చిన్న ఎపిక్ ఫ్యూరీ"కి దిగే అవకాశం ఉందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై మరోసారి దాడులు చేసేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాలు ప్రణాళికలు రచిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. అయితే, ట్రంప్ అంతిమంగా మరో సైనిక చర్యకు ఆదేశిస్తారా? లేదా? అనే దానిపై అనిశ్చితి కొనసాగుతోందని అమెరికా మీడియా పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా టెహ్రాన్ సహా ఇతర ఇరాన్ నగరాలపై దాడులు చేశాయి. దీనికి ప్రతిగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్, ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలపై దాడులు చేయడంతో పాటు, హర్మూజ్ జలసంధిపై పట్టు బిగించింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు మరింత ముదిరే ప్రమాదం కనిపిస్తోంది.

కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్: అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి

అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు 870 కి.మీ దూరంలో తీవ్ర వాయుగుండం.. ఐఎండీ అప్ డేట్

మొదటిపేజీ తరువాయి

. అదేవిధంగా, మచిలీపట్నానికి 1,060 కిలోమీటర్లు, బాపట్లకు 1,130 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం గంటకు 5 కిలోమీటర్ల నెమ్మది వేగంతో నైరుతి దిశగా కదులుతున్న ఈ వ్యవస్థ, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి తుపానుగా మారనుంది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ తుపాను అక్టోబర్ 27 ఉదయానికి తీవ్ర తుపానుగా, అక్టోబర్ 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి, ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి రానుంది. అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నంలోపు బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, ముఖ్యంగా తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వేటకు వెళ్లిన వారుంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని కోరింది. "బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్తగా కట్టి ఉంచాలి. సముద్ర తీరాల్లో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, బీచ్‌ల వద్ద సెల్ఫీలు దిగే ప్రయత్నం చేయరాదు" అని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.తుపాను కదలికలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని, ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. తీరప్రాంత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సామాన్యుల కృషికి వందనం చేయడమే 'మన్ కీ బాత్'.. ఇది ఒక తీర్థయాత్ర లాంటిది: 12 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని మోదీ

-12 ఏళ్లు పూర్తి చేసుకున్న 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమం

-ఈ ప్రయాణం ఒక తీర్థయాత్ర లాంటిదని అభివర్ణించిన మోదీ

-సామాన్యుల అసాధారణ కృషిని దేశం ముందుంచే గొప్ప అవకాశమని వెల్లడి

-శ్రోతలు చూపిన ఆత్మీయత, అనురాగం తనకు అమూల్యమైన ఆస్తి అని వ్యాఖ్య

-కుటుంబ సభ్యుడిలా దేశ ప్రజలతో కనెక్ట్ అయ్యే అవకాశం లభించిందన్న ప్రధాని

సమాజం కోసం, దేశం కోసం జీవించే వ్యక్తులు స్వయంగా పుణ్యక్షేత్రాల వంటివారు " అని ప్రధాని పేర్కొన్నారు.దేశంలోని సామాన్య ప్రజల కృషినీ, ధైర్యాన్ని, అంకితభావాన్ని, సేవా స్ఫూర్తిని చాటి చెప్పేందుకు 'మన్ కీ బాత్' ఒక అద్భుతమైన అవకాశమని ప్రధాని వివరించారు. ఈ 12 ఏళ్లలో, సమాజం దృష్టికి రాని ఎందరో మహానుభావుల అసాధారణమైన పనులను ఈ కార్యక్రమం ద్వారా దేశం ముందుంచామని గుర్తుచేశారు. "ఈ కార్యక్రమం ద్వారా నేను ఒకరకంగా మన దేశ ప్రజల శక్తికి నివాళులు అర్పిస్తున్నాను. దేశంలోని ప్రతి కుటుంబంతోనూ అనుబంధం పెంచుకునే అవకాశం నాకు లభించింది" అని తెలిపారు.చాలా మంది ప్రజలు తనకు సందేశాలు పంపుతూ.. 'మన్ కీ బాత్' వింటున్నప్పుడు, తమ మధ్యలో ఒక కుటుంబ సభ్యుడిగా కూర్చుని మాట్లాడుతున్నట్లు అనిపిస్తుందని చెబుతుంటారని మోదీ ఆనందం వ్యక్తం చేశారు. "శ్రోతలైన మీ అందరి ఆత్మీయత, అనురాగం నాకు నిజంగా అమూల్యమైన ఆస్తి" అని ప్రధాని భావోద్వేగంగా అన్నారు. తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమం 2014 అక్టోబర్ 3న విజయదశమి రోజున ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్‌లలో ప్రసారమైన విషయం తెలిసిందే.

ఇండియా బ్లాక్ ర్యాలీతో మాకు సంబంధం లేదు.. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ వెల్లడి

మొదటిపేజీ తరువాయి

ఇదే సమయంలో ప్రస్తుతం జేఎన్‌యూలో జరుగుతున్న కాశ్మీర్ ఫ్రీ గ్రాఫిటీ అంశంపై కూడా అసదుద్దీన్ మాట్లాడారు. కాశ్మీర్‌ను వేరు చేయాలంటూ యూనివర్సిటీలో రూపొందిన గ్రాఫిటీకి ఎవరు బాధ్యులు..? యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్. ఆ ఇద్దరూ ఆర్ఎస్ఎస్ ముస్లిం రాష్ట్ర మోర్చా సభ్యులే. వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలి. జేఎన్‌యూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలో న్యాయం ఉంది.ఈ విషయాన్ని విస్మరించడానికి వీల్లేదు. షర్జీల్ ఇమామ్ సిద్ధాంతాలపై మీకు వ్యతిరేకత ఉండొచ్చు. అది మీకు నచ్చకపోవచ్చు. అంతమాత్రాన అతడికి అదే అంశంపై న్యాయం జరగకుండా అడ్డుకోవడం సరికాదు. న్యాయం చేయడం అనేది కోర్టుల పని. ఆ కేసు విచారణ కొనసాగనివ్వండి. కనీసం అది కూడా జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు అంటూ అసదుద్దీన వ్యాఖ్యానించారు. ఇక.. నవంబర్ 1న ఢిల్లీ, రాంలీలా మైదానంలో ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో ర్యాలీ జరగనుంది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర కూటమి పార్టీల నేతలు ఇందులో పాల్గొననున్నారు.

ట్రంప్‌పై ఒబామా తీవ్ర విమర్శలు.. అది మోసపూరిత పాలన అంటూ ఫైర్

-ఒహాయో ర్యాలీలో ట్రంప్‌పై తీవ్రంగా విరుచుకుపడిన ఒబామా

-ఇరాన్‌తో అనవసర యుద్ధాన్ని ట్రంప్ ప్రారంభించారని ఆరోపణ

-సుంకాల వల్ల వినియోగదారులపైనే భారమన్న మాజీ అధ్యక్షుడు

-స్వప్రయోజనాల కోసమే ట్రంప్ అధ్యక్ష పదవిని వాడుకుంటున్నారని విమర్శ

-నవంబర్ 3 మధ్యంతర ఎన్నికలే చివరి అవకాశమని వ్యాఖ్య

మొదటిపేజీ తరువాయి

"ఎవరూ కోరని, ఎవరూ ఓటు వేయని అనవసరమైన యుద్ధానికి" ట్రంప్ తెరలేపారని ఒబామా విమర్శించారు. తన హయాంలో కుదుర్చుకున్న అణు ఒప్పందం కారణంగా ఒక్క క్షిపణిని కూడా ప్రయోగించాల్సిన అవసరం లేకుండానే ఇరాన్‌ను అణ్వాయుధాల తయారీ నుంచి నిరోధించగలిగామని ఆయన గుర్తుచేశారు. అయితే, గత ఏడు నెలలుగా సాగుతున్న ఘర్షణల వల్ల మిత్రదేశాలు, అమెరికా సైనిక స్థావరాలపై దాడులు జరిగాయని.. ఈ క్రమంలో అమెరికన్లు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పలువురు గాయపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టుచిక్కడం వల్లే చమురు, డీజిల్ ధరలు పెరిగాయని మండిపడ్డారు.ట్రంప్‌కు "సుంకాలంటే అమితమైన ఇష్టం" అని, అయితే వాటి భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుందని హెచ్చరించినా ఆయన పట్టించుకోలేదని ఒబామా ఎద్దేవా చేశారు. ట్రంప్ పాలనను ఒక "మోసపూరిత వ్యవస్థ" (గ్రిఫ్టర్ ప్రెసిడెన్సీ) గా అభివర్ణించిన ఆయన, అధ్యక్ష పదవిని ట్రంప్ స్వప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. మీమ్ కాయిన్లు, తన సంతానానికి చెందిన కంపెనీలకు పన్ను చెల్లింపుదారుల నిధులతో కాంట్రాక్టులు కట్టబెట్టడం, వెనిజులాకు చెందిన బిలియనీర్‌కు క్షమాభిక్ష ప్రసాదించడం వంటి అంశాలను ఈ సందర్భంగా ఒబామా ఉదహరించారు.నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికలు ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుకట్ట వేయడానికి లభించిన ఆఖరి అవకాశమని ఒబామా పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ఒహాయో గవర్నర్ అభ్యర్థి అమీ యాక్టన్, సెనేట్ అభ్యర్థి షెరాడ్ బ్రౌన్‌లకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. క్లీవ్‌ల్యాండ్ సభ అనంతరం ఆయన మిషిగాన్‌లోని డెట్రాయిట్‌లో జరగనున్న ప్రచార కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

మక్కాపై దాడి చేయలేదు.. సౌదీ చమురు క్షేత్రాలే మా లక్ష్యం: హౌతీ రెబల్స్

మొదటిపేజీ తరువాయి

యన్బు, తాయిఫ్‌లను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన రెండు క్షిపణులను నాశనం చేశామని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు పేర్కొన్నాయి.అయితే, ఈ దాడులపై హౌతీ సైనిక ప్రతినిధి యహ్యా సరీ భిన్నమైన ప్రకటన చేశారు. తాము రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం, యన్బులోని అరామ్‌కో చమురు కేంద్రం, రబీఘ్ ఆయిల్ రిఫైనరీ, పలు చమురు పంపింగ్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు తెలిపారు. దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ విమానాశ్రయం, నజ్రాన్‌లోని ఎయిర్‌పోర్ట్‌పైనా దాడి చేశామన్నారు. అయితే, ఈ దాడులు లక్ష్యాన్ని చేరుకున్నాయా? లేదా? అనేదానిపై సౌదీ అధికారులు స్పష్టత ఇవ్వలేదు.ఈ ఘర్షణలు యెమెన్ దక్షిణ ప్రాంతానికీ విస్తరించాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఏడెన్ నగరంలోని కోస్ట్ గార్డ్ ప్రధాన కార్యాలయంపై మూడు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. సౌదీ అధికారులు ఉన్న సైనిక శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. 2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఈ దాడులతో మరింత బలహీనపడింది. యెమెన్‌లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వానికి సౌదీ సంకీర్ణ దళాలు మద్దతిస్తుండగా, రాజధాని సనాతో పాటు ఉత్తర యెమెన్‌లో అధిక భాగం హౌతీల నియంత్రణలో ఉంది. కాగా, పవిత్ర నగరాలను లక్ష్యంగా చేసుకోవడం తమ ఉద్దేశం కాదని, అలాంటి వార్తలు అవాస్తవమని హౌతీలు పునరుద్ఘాటించారు.

అయ్యప్ప స్వాముల మహా పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్

ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్ష

పటాన్‌చెరు, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన అయ్యప్ప స్వాములు బీహెచ్ఈఎల్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శబరిమల సన్నిధానం వరకు చేపట్టిన మహా పాదయాత్రలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, అయ్యప్ప మాలధారణ భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో చేపట్టే మహా పాదయాత్ర ఐక్యత, సహనం, సేవాభావాన్ని మరింత పెంపొందిస్తుందని తెలిపారు.అయ్యప్ప స్వాములు నియమ నిష్ఠలతో శబరిమల యాత్రను విజయవంతంగా పూర్తి చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్వాములు చేసిన "స్వామియే శరణం అయ్యప్ప" నామస్మరణతో ఆలయ పరిసరాలు భక్తిభావంతో మార్మోగాయి.ఈ కార్యక్రమంలో మల్లేష్, శ్రీనివాస్, మహేష్, భాను, కిషోర్‌తో పాటు ఎంఆర్‌పీ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
26 సోమవారం అక్టోబర్ 2026
3
www.prajaveekshanam.in

టీ నరసాపురం ఎపిగుంటలో కూటమి జోరు: భారీ మెజారిటీతో ఎంపీటీసీ అభ్యర్థి మునీంద్ర గెలుపు తథ్యం!





- కూటమి నామస్మరణతో మార్మోగిన ఎపిగుంట వీధులు.. ఇంటింటి ప్రచారంతో హోరెత్తించిన నాయకులు!

- అగ్రనేతల వ్యూహాత్మక అడుగులు, శ్రేణుల ఉత్సాహం: ఎపిగుంటలో హాట్ టాపిక్‌గా మారిన కూటమి ప్రచారం!

నరసాపురం, అక్టోబర్ 25:(ప్రజా వీక్షణం)
ఏలూరు జిల్లాలోని టి.నరసాపురం మండలం ఎపిగుంట పంచాయతీలో రాజకీయం కూటమి పార్టీల నాయకుల అపూర్వ ఐక్యత, కార్యకర్తల ఉత్సాహం నడుమ సాగుతున్న ఎన్నికల ప్రచారం స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ పంచాయతీ నుండి పోటీ చేస్తున్న ఎంపీటీసీ అభ్యర్థి పోడియం మునీంద్ర విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు అడుగులు వేస్తున్నాయి. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, నేతల సమన్వయం చూస్తుంటే మునీంద్రా గెలుపు నూరు శాతం ఖాయమని స్పష్టమవుతోంది. ఒకే పంచాయతీలో అగ్రనేతల ఐక్యత – కూటమికి తిరుగులేని బలం

ఎపిగుంట పంచాయతీ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడి నుంచే పలువురు కీలకమైన, ప్రభావశీలమైన కూటమి నాయకులు ప్రాతినిధ్యం వహిస్తుండటం విశేషం. ఎంపీపీ అభ్యర్థి కాలనీడు రాంబాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి జట్ల రాంబాబు, నియోజకవర్గ జనసేన కోర్ కమిటీ సభ్యులు సి.హెచ్. నవీన్ వీరందరూ ఒకే పంచాయతీకి చెందినవారై ఉండటంతో పాటు, కూటమి గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సైతం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అగ్రనేతలంతా పక్కపక్కనే ఉండి ప్రచారాన్ని ముందుకు నడిపిస్తుండటంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. హోరెత్తిన ఇంటింటి ప్రచారం ..మండల తెలుగు యువత అధ్యక్షుడు కాల్నిడు వాసు ఆధ్వర్యంలో ఎపిగుంట పంచాయతీ వ్యాప్తంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను, ఎంపీటీసీ అభ్యర్థి పోడియం మునీంద్రా గెలుపు అవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ ప్రచార పర్వంలో గ్రామ ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున స్వాగతం పలకడంతో ప్రతి వీధీ కూటమి నామస్మరణతో మార్మోగింది.ప్రచారంలో పాల్గొన్న ప్రముఖులు: ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి ప్రముఖులు, నాయకులు భూషి బాబు, నారాయణరావు, నాయుడు, బచ్చల వెంకటేశ్వరరావు, సత్తిబాబు, వెంకటరత్నం, ప్రసాద్, రాము, రాజు, రవి, తేజ, లక్ష్మీ నారాయణ, సతీష్, సాయి, శివరామకృష్ణ, వీరభద్రరావు, శ్రీరంగం, త్రిమూర్తులు, పెదబాబు, రామచంద్రరావు, రాజా, వీరబాబు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపు తథ్యం :స్థానిక నేతల సమన్వయం, కార్యకర్తల కష్టపడే తత్వం, ప్రజల నుండి వస్తున్న స్పందన చూస్తుంటే ఎపిగుంట పంచాయతీలో ఎంపీటీసీ అభ్యర్థి పోడియం మునీంద్రా భారీ మెజారిటీతో విజయం సాధించడం తథ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ కూటమి ప్రచార జోరు మరింత ఊపందుకుంది.

అభివృద్ధే అజెండాగా దూసుకుపోతున్న కూటమి ప్రచారం!

-నందిగామ రూపురేఖలు మారుస్తాం..

-చేసిన అభివృద్ధి పనులే మా నమ్మకం: చైర్‌పర్సన్ అభ్యర్థి శాఖమూరి వంశీధర్

నందిగామ, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

నందిగామ మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పట్టణ అభివృద్ధి, ప్రజలకు అందించిన సేవలు, భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నందిగామ మున్సిపాలిటీలోని 25వ వార్డులో కూటమి బలపరిచిన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి శాఖమూరి వంశీధర్‌తో పాటు 25వ వార్డు అభ్యర్థి కె. నాగలక్ష్మి కలిసి ప్రజలను కలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పలకరిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.చేసిన అభివృద్ధి పనులే మా నమ్మకం.. మారనున్న నందిగామ రూపురేఖలు!ఈ సందర్భంగా నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి శాఖమూరి వంశీధర్‌మాట్లాడుతూ, ప్రజలకు చేసిన పనులను వివరిస్తూ వారి ముందుకు వచ్చి ఓటు అడుగుతున్నామని పేర్కొన్నారు. నందిగామ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని, రాబోయే రోజుల్లో నందిగామ రూపురేఖలు పూర్తిగా మారిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు.ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నందిగామను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజలు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి, అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కూటమి నేతలు, కార్యకర్తలు అభ్యర్థులతో కలిసి ప్రజలను కలుసుకుంటూ ఎన్నికల మద్దతు కోరుతున్నారు. నందిగామ అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను ప్రధాన అంశాలుగా చేసుకుని ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.



ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





- చండ్రుగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

- డిజిటల్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించి శ్రేణులకు దిశానిర్దేశం

- కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని పిలుపు

చండ్రుగొండ, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం):

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ మరియు ఆన్‌లైన్ ఓటరు నమోదు ప్రక్రియను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చండ్రుగొండ మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం విస్తృతంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మండలంలోని మద్దుకూరు, దామరచర్ల, అయ్యనపాలెం, సీతాయిగూడెం తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన వివిధ ఓటరు నమోదు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు.

అలాగే గ్రామాల్లో జరుగుతున్న డిజిటల్ ఓటరు నమోదు తీరును ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరిశీలించారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పేర్లు ఎలా నమోదు చేస్తున్నారు, ఏమైనా సాంకేతిక సమస్యలు వస్తున్నాయా అనే వివరాలను అక్కడికక్కడే ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్క ఓటరు పేరు జాబితాలో కచ్చితంగా నమోదయ్యేలా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ... ఖమ్మం – నల్గొండ – వరంగల్ పట్టభద్రుల (ఉపాధ్యాయ/ఎమ్మెల్సీ) కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కుటుంబం ఎన్నో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితమై సేవలందిస్తున్న పరిపూర్ణ కాంగ్రెస్ కుటుంబమని కొనియాడారు.పార్టీ కోసం నిరంతరం శ్రమించిన ఆ కుటుంబానికి చెందిన అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులంతా ఎలాంటి అభిప్రాయభేదాలకు తావులేకుండా సంపూర్ణ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అభ్యర్థి విజయమే ఏకైక లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడాలని పిలుపునిచ్చారు.ఈ పర్యటనలో మరియు ఓటరు నమోదు పరిశీలన కార్యక్రమంలో చండ్రుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లమోతు రమణారావు, సీనియర్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మాలోత్ బోజ్యానాయక్, తుమ్మలపల్లి సురేష్, సారేపల్లి శేఖర్, జిల్లా దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.వీరితో పాటు మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

నందిగామ 14వ వార్డులో సీపీఎం అభ్యర్థికి ప్రజాదరణ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సయ్యద్ బాజీద్ ప్రచారం

నందిగామ, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

నందిగామ మున్సిపాలిటీ 14వ వార్డు సీపీఎం అభ్యర్థి సయ్యద్ బాజీద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో ప్రజల నుంచి ఆదరణ లభించిందని పార్టీ నాయకులు తెలిపారు.తాను గెలిస్తే వార్డులో మంచినీటి సమస్య, డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు పెరిగిన ఇంటి పన్నులు, నీటి పన్నులపై కౌన్సిల్‌లో గళమెత్తుతానని బాజీద్ హామీ ఇచ్చారు.ఈ ప్రచారంలో సీపీఎం నందిగామ కార్యదర్శి కె. గోపాల్, సయ్యద్ ఖాసిం, గోపి నాయక్, జంగా దామోదర్, చనుమోలు మేగిలమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.




నందిగామ మున్సిపల్ ఎన్నికలు: తుది పోరులో 75 మంది అభ్యర్థులు

చైర్‌పర్సన్ పదవికి ఐదుగురు అభ్యర్థుల ఖరారు

నందిగామ, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం):

నందిగామ పురపాలక సంఘ పరిధిలోని 32 వార్డులకు సంబంధించి తుది పోరులో 5 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.ముఖ్యమైన వివరాలు:ఏకగ్రీవం: 8వ వార్డు అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.చైర్‌పర్సన్ రేసు: మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి ఐదుగురు అభ్యర్థులు తుది పోటీలో నిలిచారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన ప్రకటన మేరకు అభ్యర్థుల తుది జాబితాను ఆదివారం మధ్యాహ్నం 3:00 గంటలకు సంబంధిత ఎన్నికల అధికారుల కార్యాలయాలతో పాటు, నందిగామ పురపాలక సంఘ కార్యాలయంలో ప్రదర్శించినట్లు మున్సిపల్ కమిషనర్ జి. లోవరాజు తెలిపారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

గుంటూరు నగర మేయర్ అభ్యర్థి షేక్ ఖాదర్ బీ ని గెలిపించండి

నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ప్రచారం

గుంటూరు : అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

నవతరం పార్టీ గుంటూరు నగర మేయర్ అభ్యర్థి షేక్ ఖాదర్ బీ దశాబ్ద కాలంగా నవతరం పార్టీ నుండి గుంటూరు నగరంలో ప్రజల యొక్క సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నటువంటి విషయం అందరికీ తెలుసని,ఆమెను అత్యధిక మెజారిటీ తోటి గెలిపించాలని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గుంటూరు నగరం లోని వసంతరాయపురం చుట్టుపక్కల ఉన్నటువంటి కాలనీలలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.....ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కూడా అనేక సమస్యలు పరిష్కారం కాకుండా అలానే ఉండటం బాధ కలిగించిందన్నారు.ప్రజల సమస్యలు పరిష్కారం కోసమే స్థానిక సంస్థలు ఎన్నికల్లో నవతరం పార్టీ నుండి రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల్ని బరిలో దించినట్లు నవతరం పార్టీ నుండి అభ్యర్థులు గెలుపొందే అవకాశం ఉన్నట్లుగా సర్వేలు చెప్తున్నాయని అభ్యర్థులకి ఓట్లు వేసి గెలిపిస్తే నవతరం పార్టీ నుండి పూర్తిస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పని చేస్తామని ఆయన అన్నారు ఆయనతో పాటుగా నగర మేయర్ అభ్యర్థి షేక్ ఖాదర్ బీ,నవతరం పార్టీ నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొని విస్తృతంగా గుంటూరు నగరంలో పర్యటించారు.



నందిగామలో కూటమి జోరు.విక్టరీ సింబల్‌తో హోరెత్తిన ప్రచారం

అభివృద్ధే అజెండాగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నాయకత్వంలో ముందడుగు

నందిగామ: అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

నందిగామ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కూటమి శ్రేణులు జోరు పెంచాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నాయకత్వంలో, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి శాఖమూరి వంశీధర్ సారథ్యంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొంటూ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. విక్టరీ సింబల్స్‌తో నినాదాలు చేస్తూ, టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలతో వీధుల్లో సందడి చేస్తున్నారు.గత ఏడాదిన్నరలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల సదుపాయాలతో పాటు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు అందించిన ప్రయోజనాలను వివరిస్తూ కూటమి అభ్యర్థులు ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు.ప్రతి వార్డులోనూ ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



రెడ్డి సూరిబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వడ్డీ రఘురామ్ నాయుడు

తాడేపల్లిగూడెం ప్రతినిధి, అక్టోబరు 25 (ప్రజా వీక్షణం)

పెంటపాడు మండలంలోని పెంటపాడు గ్రామానికి చెందిన రెడ్డి సూరిబాబు గుండెకు స్టెంట్ వేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు ఆదివారం ఆయనను పరామర్శించారు. సూరిబాబు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేద్దాం



-ఐకమత్యంతో పనిచేసి మున్సిపల్,ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భారీ విజయం సాధించాలి.

- ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,చేయబోయే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కటి

ప్రజలకు తెలియజేద్దాం -అభివృద్ధి,సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది -పల్లం సరోజినీ జీవన్

బాపట్ల : అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బాపట్లలో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులు గెలుపు కొరకు ప్రతి ఒక్క కూటమి పార్టీలకు చెందిన ప్రతి ఒక్కరు కృషి చేయాలని,రానున్న మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించే దిశగా పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో, ఐకమత్యంతో పనిచేయాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ జీవన్ పిలుపునిచ్చారు.ఆదివారం ఆమె మీడియా తో మాట్లాడుతూ..... ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ఐకమత్యం విజయానికి కీలకమని పేర్కొన్నారు.ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు విశేష సేవలు అందించేందుకు కృషి చేస్తోందని పల్లం సరోజిని జీవన్ వివరించారు. రాష్ట్ర ప్రగతితో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు.కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తూ ప్రజల మద్దతును పొందాలని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

జీలుగుమిల్లి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం.. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతిలి





జీలుగుమిల్లి, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం):

ఏలూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జీలుగుమిల్లి మండలం కేంద్రంలో వేగంగా దూసుకొచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు (బైకులు) అత్యంత భీకరంగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లి మండలం కేంద్రంలోని మసీదు సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం సంభవించింది. రెండు వేర్వేరు దిశల నుంచి అతివేగంగా వస్తున్న రెండు బైకులు అదుపుతప్పి ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద తీవ్రతకు బైకులు నుజ్జునుజ్జు కాగా,ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై బలంగా పడి తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద ధ్వనికి ఉలిక్కిపడిన స్థానికులు వెంటనే అప్రమత్తమై పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. క్షతగాత్రుల పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో, వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం వారిని తక్షణమే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.అయితే, ఆసుపత్రికి తరలించేసరికి మరియు వైద్యులు చికిత్స అందించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే వారి పరిస్థితి పూర్తిగా విషమించింది. తీవ్ర రక్తస్రావం, తలకు బలమైన గాయాలు కావడంతో ఆ ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతూ మృతి చెందారు.మృతి చెందిన వారిలో జోడే బోడిగూడేనికి చెందిన పూనేం సింధూర్ గా గుర్తించారు. మరొకరు టి. నర్సాపురం మండలం కృష్ణాపురానికి చెందిన భూక్యా భద్రం గా గుర్తించారు.ఒక్కసారిగా ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదపు రూపంలో విగతజీవులుగా మారడంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామాల్లో ఏకకాలంలో విషాద వాతావరణం నెలకొంది.స్థానిక పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోటనాగవరం టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా సున్నం నాగ దుర్గరావు విజయం తథ్యం: కూటమి నాయకుల ధీమా

- గ్రామ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి శ్రేణులు- ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందన్న బీజేపీ నేత

- సైకిల్ గుర్తును భారీ మెజారిటీతో గెలిపించాలని - కొండేపాటి రామకృష్ణ పిలుపు



బుట్టాయిగూడెం మండలం అక్టోబర్ 25(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం పరిధిలోని కోట నాగవరం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల సమరం హోరా హోరీగా మారుతున్న తరుణంలో, కొత్త నాగవరం నుంచి తెలుగు దేశం పార్టీ (టీడీపీ) ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న సున్నం నాగ దుర్గరావు ఘన విజయం సాధించడం ఖాయమని కూటమి నాయకులు స్పష్టం చేశారు. గ్రామంలో నిర్వహించిన కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తల సంయుక్త సమావేశంలో ఈ మేరకు గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కొండేపాటి రామకృష్ణ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ... “కోట నాగవరం గ్రామానికి సంపూర్ణ అభివృద్ధి జరగాలంటే అది కూటమి విజయంతోనే సాధ్యమవుతుంది. ఇక్కడి నుంచి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సున్నం నాగ దుర్గరావు కేవలం రాజకీయ నాయకుడే కాదు, ప్రజల కష్టసుఖాల్లో నిత్యం వెంటే ఉండే మంచి వ్యక్తి. ఆయనకు గ్రామంలో ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనే ఆయన గెలుపును ముందే తేల్చిచెబుతోంది” అని కొనియాడారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకూ చేరవేయడంలో సున్నం నాగ దుర్గరావు ముందుంటున్నారని కూటమి నేతలు ప్రశంసించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా ఆయన ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఆయన చూపే చొరవ అభినందనీయమన్నారు.అలాగే కోట నాగవరం గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే ప్రణాళికతో సున్నం నాగ దుర్గరావు ముందుకు వెళ్తున్నారని నాయకులు తెలిపారు.అలాగే గ్రామ ప్రజలందరూ ఈ ఎన్నికలను అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లందరూ ఏకమై సైకిల్ గుర్తుపై ఓటు వేసి, సున్నం నాగ దుర్గరావును అత్యధిక మెజారిటీతో ఎంపీటీసీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల మండల స్థాయి నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువజన సంఘాల సభ్యులు మరియు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమావేశం అనంతరం కూటమి నాయకులు గ్రామంలో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS
26 సోమవారం అక్టోబర్ 2026
5
www.prajaveekshanam.in

చింతలపూడిలో ఘనంగా నూతన కోర్టు భవన ప్రారంభోత్సవం ..





రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల భద్రతపై ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ హైఅలర్ట్ సమీక్ష!

చింతలపూడి అక్టోబర్ 25(ప్రజా వీక్షణం):

ఏలూరు జిల్లాలోని ప్రముఖ ప్రాంతమైన చింతలపూడిలో న్యాయ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా ఒక మైలురాయి సంఘటన చోటుచేసుకుంది. చింతలపూడి పట్టణంలో అత్యంత ఆధునిక హంగులతో, విశాలమైన వసతులతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నూతన కోర్టు భవన ప్రారంభోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ మహత్తర కార్యక్రమానికి ముఖ్య అతితులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులకు ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి, అత్యంత మర్యాదపూర్వకంగా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయస్థానాల ద్వారా సామాన్య ప్రజలకు మరింత వేగంగా, సత్వర న్యాయం అందుబాటులోకి వస్తుందని, ప్రజాస్వామ్య పరిరక్షణలో న్యాయ వ్యవస్థ పాత్ర అత్యంత కీలకమని ఎస్పీ అభిప్రాయపడ్డారు.

చింతలపూడి సర్కిల్ కార్యాలయంలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ – అధికారులకు దిశానిర్దేశం నూతన కోర్టు భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసన వెంటనే, ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ చింతలపూడి సర్కిల్ కార్యాలయాన్ని ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీతో పోలీసు సిబ్బందిలో ఒక్కసారిగా అప్రమత్తత నెలకొంది.సర్కిల్ పరిధిలోని పలు పోలీసు స్టేషన్లకు సంబంధించిన క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసులు, ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల సిబ్బంది ఏ విధంగా స్పందిస్తున్నారు, ఫిర్యాదుల స్వీకరణ తీరు ఏ విధంగా ఉందనే అంశాలపై అధికారులను ఆరా తీశారు.అంతేకాకుండా శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎప్పుడూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడితోనూ మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు.

రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికల పర్వానికి సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో, త్వరలో జరగనున్న జడ్పీటీసీ మరియు ఎంపీటీసీ ఎన్నికలను అత్యంత ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా చింతలపూడి, లింగపాలెం మండలాల్లో చేపట్టాల్సిన పకడ్బందీ భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ గారు పోలీసు అధికారులతో సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా చిన్న పొరపాటుకూడా జరగకూడదని హెచ్చరించారు.ఈ సందర్భంగా స్థానిక పోలీసు అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు, మార్గదర్శకాలను జారీ చేశారు:

సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు – ప్రత్యేక నిఘా : గత ఎన్నికల సరళి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకుని.. సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించాలి. అటువంటి ప్రాంతాల్లో ముందస్తు చర్యగా భారీగా పోలీసు బలగాలను మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.భయరహిత వాతావరణంలో స్వేచ్ఛా ఓటింగ్ : గ్రామీణ ప్రాంతాల ఓటర్లు, బలహీన వర్గాల ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు, బెదిరింపులకు లేదా అక్రమ ప్రలోభాలకు గురికాకుండా తమ అమూల్యమైన ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తి భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపేందుకు రూట్ మార్చ్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కా అమలు : ఎన్నికల కోడ్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో అక్రమంగా జరిగే నగదు రవాణా, మద్యం పంపిణీ, ఉచితాలు మరియు ఇతర ప్రలోభాలపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, తనిఖీలను ముమ్మరం చేయాలని హెచ్చరించారు. "ప్రశాంతమైన ఎన్నికలు.. పటిష్టమైన భద్రత.. ప్రజాస్వామ్యానికి బలమైన పునాది." ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అనేవి ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే పవిత్రమైన ప్రక్రియ అని, వాటిని సజావుగా, సక్రమంగా నిర్వహించడం ద్వారానే రాజ్యాంగ విలువల పరిరక్షణ సాధ్యమవుతుందని ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఉద్ఘాటించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో చింతలపూడి, లింగపాలెం మండలాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో తుఫాన్ హెచ్చరికలు

- ముందస్తు చర్యలకు కలెక్టర్ ఆదేశం!

ఏలూరు జిల్లా అక్టోబర్ 25(ప్రజా వీక్షణం)

తుఫాన్ కారణంగా రానున్న 3 రోజులపాటు ఏలూరు జిల్లాలో భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జిల్లా యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేశారు.ఈ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా నదులు, చెరువులు, కాలువలకు ఎటువంటి గండ్లు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖాధికారులను కలెక్టర్ గట్టిగా ఆదేశించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో నదీ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు ఎవరూ నదిలోకి వెళ్లకుండా అధికారులు తుఫాన్ తీవ్రతపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు.ఎటువంటి సమస్యాత్మక ప్రాంతాలనైనా ముందుగానే గుర్తించి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్.. ఎటువంటి క్లిష్ట పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.అత్యవసర సహాయం కోసం ఏలూరు కలెక్టరేట్‌లో 18002331077, 08812-224519, 9491041419 ఫోన్ నంబర్లతో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



నందిగామలో టీడీపీకి బిగ్ షాక్ కాదు..

బూస్ట్.27వ వార్డు నుంచి భారీగా పసుపు - కండువా కప్పుకున్న 15 వైసీపీ కుటుంబాలు

-నందిగామలో టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణ.. వైసీపీకి మరో షాక్

-27వ వార్డు నుంచి టీడీపీలోకి 15 కుటుంబాలు.. కూటమి అభివృద్ధి, సంక్షేమ

-పాలనపై విశ్వాసంతో పసుపు కండువా కప్పుకున్న వైసీపీ కార్యకర్తలు, కుటుంబాలు

నందిగామ అక్టోబర్ 25. (ప్రజా వీక్షణం)

నందిగామ పట్టణంలో తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ పెరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల వేళ వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. నందిగామ పట్టణంలోని 27వ వార్డుకు చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.టీడీపీ నేతలతో కలిసి పార్టీలో చేరిన కుటుంబాలకు పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీలోకి..కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాము తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆ 15 కుటుంబాలు వెల్లడించాయి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత తమను ఆకర్షించిందని పేర్కొన్నాయి.నందిగామ మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్న వేళ 27వ వార్డు నుంచి 15 కుటుంబాలు టీడీపీలో చేరడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, మరింత విస్తృతంగా ప్రజల మద్దతు కూడగట్టేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారు.నందిగామ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని ఈ చేరికలు తెలియజేస్తున్నాయని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపే లక్ష్యంగా శ్రేణులు కదం తొక్కాలి!





- పట్టభద్రులందరినీ సమాయత్తం చేయాలని పిలుపునిచ్చిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం):

త్వరలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి ఘనవిజయమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో, సమన్వయంతో కృషి చేయాలని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు.ఆదివారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్సా వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం అత్యంత వైభవంగా మరియు విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సీనియర్ నాయకులు భానోత్ భీముడు, అశ్వారావుపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ కోఆర్డినేటర్ పాలకుర్తి సుమిత్ పర్యవేక్షణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కీలక సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ... ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకుంటున్న పట్టభద్రులను పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు స్వయంగా నేరుగా కలిసి, అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకునేలా వారికి తగిన అవగాహన కల్పించి సహాయం అందించాలని కోరారు. కేవలం ఓట్లు నమోదు చేయించడమే కాకుండా, నమోదైన పట్టభద్రుల ఓటర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ వారితో సత్సంబంధాలు కొనసాగించాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా వారి నుంచి పూర్తి మద్దతును కూడగట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం సాధించే వరకు ప్రతి కార్యకర్త కూడా ఒక సైనికులా పని చేయాలని, గ్రామ, మండల స్థాయిల్లో క్షేత్రస్థాయిలో పట్టభద్రులను సమాయత్తం చేస్తూ పార్టీ విజయం కోసం కృషి చేయాలని స్పష్టం చేశారు.ఈ సన్నాహక సమావేశంలో అన్నపురెడ్డిపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేస్తామని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ముక్తకంఠంతో తీర్మానించాయి.



ప్రజావీక్షణం
దినపత్రిక

నందిగామలో ఫ్యాన్ జోరు.. గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రచారం!

12వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు

నందిగామ, అక్టోబర్ 25: (ప్రజా వీక్షణం)

నందిగామ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జోరు పెంచింది. పట్టణంలోని 12వ వార్డులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చల్లా బ్రహ్మేశ్వరరావు (బ్రహ్మం), 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కంభంపాటి రజితను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నందిగామ పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని జగన్‌మోహన్‌రావు తెలిపారు. 100 పడకల ఆసుపత్రి, కేంద్ర విద్యాలయం మంజూరు, ప్రధాన రహదారుల విస్తరణ, భారీ డ్రైనేజీల నిర్మాణాలకు తమ ప్రభుత్వ హయాంలోనే పునాదులు పడ్డాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించామని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నందిగామ పట్టణానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, వెంకట్ రెడ్డి, షేక్ ఫాతిమా, పెదాలు పిచ్చయ్య, కె.టి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారుల తనిఖీలు

స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లు, పోలింగ్ కేంద్రాల పరిశీలన

నందిగామ, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో నందిగామలో భద్రతా ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూరల్ డీసీపీ బి. లక్ష్మీనారాయణ, ఐపీఎస్, నందిగామ డివిజన్ ఏసీపీ సీహెచ్. శ్రీనివాసరావు స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లు, పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రి భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ప్రమాణాలు, కౌంటింగ్ హాళ్లలో ప్రవేశ మార్గాలు, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజా రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు జరగకుండా నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు పుకార్లను నమ్మవద్దని, ధ్రువీకరించని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయవద్దని, అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.ఈ తనిఖీల్లో నందిగామ టౌన్ సీఐ పి. శ్రీను, రూరల్ సీఐ వై.వి.వి.ఎల్. నాయుడు, సర్కిల్ ఎస్ఐలు పాల్గొన్నారు.



ఏలూరు జిల్లాలో ఎన్నికల పకడ్బందీ ఏర్పాట్లు: పారదర్శకంగా, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహిస్తామని ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ స్పష్టీకరణ

- జంగారెడ్డిగూడెంలో స్ట్రాంగ్ రూమ్‌లు, డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన ఉన్నతాధికారులు ..

-సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా!

జంగారెడ్డిగూడెం అక్టోబర్ 25(ప్రజా వీక్షణం)

రాబోయే సార్వత్రిక/స్థానిక ఎన్నికలను అత్యంత పకడ్బందీగా, సమర్థవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే ధ్యేయంగా ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఐజీ అశోక్ కుమార్ మరియు ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ సంయుక్తంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో భద్రతా ప్రమాణాలు, ఈవీఎంల భద్రతకు తీసుకుంటున్న చర్యలు, మరియు మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు.జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అమర్చిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ, అగ్నిమాపక రక్షణ ఏర్పాట్లు, మరియు 24 గంటల పటిష్ట సాయుధ పోలీసు బందోబస్తును ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి, భద్రతా నిబంధనలను నిక్కచ్చిగా పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా జిల్లాలోని సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అదనపు బలగాలను మోహరించడంతో పాటు, రౌడీషీటర్లు మరియు అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు స్పష్టం చేశారు.ఈ పర్యటనలో భాగంగా జంగారెడ్డిగూడెం డివిజనల్ పోలీసు అధికారి (డీఎస్పీ) కార్యాలయాన్ని ఐజీ, ఎస్పీలు సందర్శించి, కార్యాలయంలోని పలు రికార్డులు, పెండింగ్ కేసులు, రౌడీషీటర్ల పట్టికలు, నేరాల నమోదుకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా జిల్లా పోలీస్ శాఖ పూర్తి భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్లు (సీఐ), సబ్ ఇన్స్పెక్టర్లు (ఎస్ ఐ) మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రౌతుగూడెంలో కెచ్చల మంగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

-విషాద సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

-వల్లా లక్ష్మీదేవి తండ్రి మంగిరెడ్డి కార్యంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు

వేలేరుపాడు అక్టోబర్ 25(ప్రజా వీక్షణం)



వేలేరుపాడు మండలంలోని రౌతుగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్న వేళ, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పేందుకు పోలవరం నియోజకవర్గం వైస్సార్సీపీ మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు స్వయంగా ఆ గ్రామాన్ని సందర్శించారు.వేలేరుపాడు మాజీ ఎంపీపీ, నాయకురాలు వల్లా లక్ష్మీదేవి తండ్రి కెచ్చల మంగిరెడ్డి ఇటీవల దివంగతులయ్యారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు నిర్వహించిన కార్యం (సంస్మరణ కార్యక్రమం) నిమిత్తం తెల్లం బాలరాజు రౌతుగూడెం చేరుకున్నారు.ఈ సందర్భంగా తెల్లం బాలరాజు కెచ్చల మంగిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న వల్లా లక్ష్మీదేవి వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా కలుసుకుని, వారిని ఆప్యాయంగా ఓదార్చారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులంతా గుండె నిబ్బరంతో, మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ దుఃఖ సమయంలో తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఏ కష్టమొచ్చినా తాము ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తో పాటు స్థానిక పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల పార్టీ శ్రేణులు, మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని కెచ్చల మంగిరెడ్డి కి ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

మహిళల సంక్షేమమే మా ధ్యేయం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

-నాగుపల్లిలో ఘనంగా కమ్యూనిటీ భవన భూమి పూజ

-పెద్ద ఎత్తున హాజరైన పీసీసీ సభ్యులు, సర్పంచ్, డ్వాక్రా మహిళలు

దమ్మపేట, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలపడాలనే ఉద్దేశంతో నాగుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న డ్వాక్రా మహిళల కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం ఘనంగా శంకుస్థాపన చేసి, శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. నాగుపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, సంఘం యొక్క ముఖ్య కార్యకలాపాలు సాఫీగా సాగించుకోవడానికి తగిన వసతులు కల్పించడంలో భాగంగా ఈ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే మహిళలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని, త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు, మహిళా సాధికారతకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేస్తున్న కృషిని పలువురు నాయకులు కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు మరింత చురుగ్గా పనిచేసేందుకు ఇలాంటి భవనాలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజలు, డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యే గారికి ఘనస్వాగతం పలికి, తమ చిరకాల కోరికను నెరవేర్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పీసీసీ సభ్యులు మద్దిశెట్టి సత్యప్రసాద్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఇస్లావత్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కుంపటి వేణు, మారగాని నాగేశ్వరరావు, వార్డు సభ్యులు కానిన కుమారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు మరియు భారీ సంఖ్యలో డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం మహిళలు తమ సంతోషాన్ని పంచుకున్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
26 సోమవారం అక్టోబర్ 2026
7
www.prajaveekshanam.in

అశ్వారావుపేటలో మానవత్వం చాటుకున్న బీఆర్ఎస్ నాయకులు..

పలు పరామర్శ కార్యక్రమాల్లో క్రియాశీలక భాగస్వామ్యం





-అనారోగ్యంతో బాధపడుతున్న వెంకన్నబాబుకు ఆర్థిక సహాయం, మెరుగైన వైద్యంపై సలహా

-కల్వరి ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు..

మృతి చెందిన అల్లాడి నాగేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

-పలువురు ప్రముఖ బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ల హాజరు

అశ్వారావుపేట, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించిన పలు పరామర్శ కార్యక్రమాలు స్థానికంగా ప్రశంసలు అందుకున్నాయి. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో నాయకులు ఈ సేవా కార్యక్రమాలను చేపట్టారు.

7వ వార్డు కౌన్సిలర్ కొల్లి రవికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో బీఆర్ఎస్ ప్రముఖ నాయకులు కాసాని చంద్రమోహన్, కాసాని పద్మ, 14వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలోనే కాకుండా, మానవీయ కోణంలోనూ తాము ముందుంటామని ఈ సందర్భంగా నాయకులు నిరూపించారు.అనారోగ్య బాధితునికి భరోసా.. ఆర్థిక సహాయం అందజేత ఈ పర్యటనలో భాగంగా, పేటమాలపల్లి గ్రామానికి చెందిన నందికోళ్ల వెంకన్నబాబు తీవ్ర అనారోగ్యంతో అస్వస్థతకు గురయ్యారన్న సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు వెంటనే ఆయన నివాసానికి వెళ్లారు. వెంకన్నబాబును ఆప్యాయంగా పరామర్శించి, ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు.అలాగే బాధితునికి మనోధైర్యం నింపేందుకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా కాసాని చంద్రమోహన్, డా. భూక్యా ఉదయ జ్యోతి, గుడవర్తి వెంకటేశ్వరరావు సంయుక్తంగా వెంకన్నబాబు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.వైద్య రిపోర్టుల పరిశీలన.. మెరుగైన ఆసుపత్రికి సిఫారసు ఈ కార్యక్రమంలో వైద్యురాలైన 14వ వార్డు కౌన్సిలర్ డా. ఉదయ జ్యోతి ప్రత్యేక చొరవ తీసుకుని వెంకన్నబాబుకు సంబంధించిన వైద్య రిపోర్టులను పరిశీలించారు. వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం అందించేందుకు తగిన ఆసుపత్రిని సూచించారు.ఈ సందర్భంగా ప్రముఖ నాయకులు కాసాని చంద్రమోహన్ మాట్లాడుతూ.. “ప్రజల కష్టసుఖాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది. వెంకన్నబాబు కుటుంబానికి అవసరమైన వైద్యం విషయంలోనూ, మరే ఇతర సహాయం కావాలన్నా నేను వ్యక్తిగతంగా అండగా ఉంటాను” అని భరోసా కల్పించారు. ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు.. సంతాపం అనంతరం అశ్వారావుపేటలోని స్థానిక కల్వరి ప్రార్థన మందిరానికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు, అక్కడ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని దేవుని ఆశీస్సులు కోరారు. సమాజంలో శాంతి, సుఖసంతోషాలతో పాటు ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు.అదేవిధంగా, ఇటీవల కాలంలో మృతి చెందిన అల్లాడి నాగేశ్వరరావు కుటుంబాన్ని నాయకులు పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి కలిగిన తీరని లోటును భరించే శక్తిని ప్రసాదించాలని కోరుతూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.పాల్గొన్న ప్రముఖులుఈ పరామర్శ మరియు సేవా కార్యక్రమాల్లో మాజీ టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, జుజ్జూరపు శ్రీరామమూర్తి, శెట్టిపల్లి రఘురామ్, పాలవలస జీవనరావు, నార్లపాటి చిన్నబ్బాయి, తగరం జగన్నాథం, జక్కుల రాంబాబు, ఖాసీం, పాడాల అఖిల్, రాజనాల గంగాధర్, బుడిపూటి సాయి, బుడిపూటి రవి, అల్లాడి ప్రదీప్ కుమార్, నందికోళ్ల సంతోష్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా 2002-2002 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

-25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై గురువులు.. శిష్యులకు...

-25 ఏళ్ల స్నేహ బంధానికి ప్రతీకగా కేక్ కటింగ్..

దేవరకద్ర, అక్టోబర్ 25 ప్రజావిక్షణం

కౌకుంట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కౌకుంట్ల 2001-2002 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవడంతో ప్రాంగణం ఆనందోత్సవాలతో నిండిపోయింది. ఈ సందర్భంగా ముందుగా పూర్వ విద్యార్థులు తమ గురువులకు పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ముందుకు సాగేందుకు మార్గ నిర్దేశం చేసిన గురువుల సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు అయిన జగదీశ్వరయ్య, రామ్ రెడ్డి, రామాచారి, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, భాగ్య రేఖ, విజయ్ కుమార్, అబ్దుల్ గని, వహీద్, ఉమాపతి రెడ్డి, రాములు, రామా శర్మ,ముస్తఫా, లను పూర్వ విద్యార్థులు శాలువతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. తమకు విద్యాబోధన చేసిన గురువులకు ఇన్నేళ్లు తర్వాత కలుసుకోవడం పూర్వ విద్యార్థుల్లో ఆనందం నింపింది. అనంతరం దివంగత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేసిన నిర్వాహకులకు కూడా శాలువతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. చిన్ననాటి స్నేహాలు, తరగతి గది అల్లర్లు ఆటపాటలు గురువుల మందలింపులు వారు నేర్పిన జీవిత పాఠాలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. అనంతరం 25 ఏళ్ల స్నేహ బంధానికి ప్రతీకగా కేక్ కటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు జిల్లాలో ఉధృతమైన ఎక్సైజ్ తనిఖీలు... స్థానిక ఎన్నికల వేళ నాటుసారా, అక్రమ మద్యం కట్టడే లక్ష్యంగా అధికారుల ఆదేశాలు!

-జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు...

-పాత నేరస్తులను బైండోవర్ చేయాలని ఆదేశం

జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 25:(ప్రజా వీక్షణం)

రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఏలూరు జిల్లాలో ఎక్సైజ్ శాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు జరిగే అక్రమ మద్యం మరియు నాటుసారా రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా, ఆదివారం ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనాల ఆవులయ్య జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నాటుసారా తయారీ, అక్రమ మద్యం నిల్వలు మరియు ఇతర రాష్ట్రాల నుంచి సుంకం చెల్లించని మద్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే పాత నేరస్తులందరినీ వెంటనే గుర్తించి బైండోవర్ చేయాలని స్పష్టం చేశారు.స్టేషన్ తనిఖీ ముగిసిన వెంటనే, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనాల ఆవులయ్య జంగారెడ్డిగూడెం సమీపంలోని తాటియాకులగూడెం వద్ద గల ఆంధ్ర – తెలంగాణ బోర్డర్ చెక్ పోస్ట్‌ను సందర్శించారు. సరిహద్దుల గుండా అక్రమ మద్యం రవాణా జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. తెలంగాణ మరియు ఇతర ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని అత్యంత నిశితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ తనిఖీలలో అలసత్వం ప్రదర్శించవద్దని, అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని తేల్చిచెప్పారు.ఈ ఆకస్మిక తనిఖీలు మరియు పర్యటన కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె . శ్రీను బాబు, ఎస్సై సుబ్రమణ్యం, ట్రైనీ ఎస్సై ఎల్. దుర్గా శ్రావణి, చెక్ పోస్ట్ ఎస్సై షేక్ బాజీ షాహిద్, ఎస్ఎస్‌టి టీమ్ ఇంచార్జ్ సీహెచ్ . రమేష్ మరియు ఇతర ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు కట్టుదిట్టంగా అమలయ్యేలా, ఎక్సైజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ముమ్మర తనిఖీలు చేపడుతుండటంతో అక్రమ మద్యం వ్యాపారుల్లో గుబులు మొదలైంది.



వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేయండి: జడ్పీటీసీ అభ్యర్థి ఉప్పెలి సుధారాణి

మండల సమగ్ర అభివృద్ధే ధ్యేయం.

తక్కెళ్లపాడులో విస్తృత ప్రచారం

నందిగామ, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం):

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండల జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉప్పెలి సుధారాణి ఆదివారం మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమై మద్దతు సేకరించారు.ఈ సందర్భంగా ఉప్పెలి సుధారాణి మాట్లాడుతూ. మండలంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీరు, డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం మరియు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు.రాబోయే జడ్పీటీసీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి పూర్తి మద్దతు తెలిపి వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. ప్రజాసేవే ధ్యేయంగా, గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేసేందుకు తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులను, గ్రామప్రజలను ఈ సందర్భంగా అభ్యర్థించారు.

ఆర్నబ్ తుఫాను ముప్పు: పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద పర్యాటక బోట్ల నిలుపుదల!

- అక్టోబరు 26 నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వర్తించనున్న ఆంక్షలు

- ప్రయాణికుల భద్రత దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టిన సబ్ కలెక్టర్ చిట్టపులి నరేంద్ర పడాల్

చింతూరు అక్టోబర్ 25(ప్రజా వీక్షణం)

ఆర్నబ్ తుఫాను ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని నేపథ్యంలో, గోదావరి నదిలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యగా చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద పర్యాటక బోట్ల నిర్వహణను అక్టోబరు 26వ తేదీ నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు నిలిపివేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, చింతూరు సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ చిట్టపులి నరేంద్ర పడాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వాతావరణ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా బలపడే అవకాశం ఉందని, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంతో పాటు గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ ముందస్తు చర్య తీసుకున్నట్లు తెలిపారు. ఇన్‌ల్యాండ్ వెసెల్స్ చట్టం, 1917కు అనుగుణంగా రూపొందించిన నిబంధనలను అనుసరించి ఈ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంటూ, బోటు నిర్వాహకులు, యజమానులు, సంబంధిత అధికారులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని మరియు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద ఎలాంటి బోటింగ్ కార్యకలాపాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.







ప్రజావీక్షణం
దినపత్రిక

కుక్కునూరులో వైఎస్సార్సీపీలోకి భారీ వలసలు.. ఒకే రోజు 43 కుటుంబాలు పార్టీలో చేరిక!

కుక్కునూరు అక్టోబర్ 25(ప్రజా వీక్షణం)

కుక్కునూరు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేరికల పర్వం జోరుగా సాగుతోంది. మండల కన్వీనర్ తాండ్ర రాజేష్ మరియు మాజీ సర్పంచ్ రావు వినోద్ ఆధ్వర్యంలో మండలంలోని మాధవరం, సీఎం కాలనీ ప్రాంతాలలో ఏకంగా 43 కుటుంబాలు స్వచ్ఛందంగా వైఎస్సార్సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్సీపీ విధానాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నట్లు నూతనంగా చేరిన కుటుంబాలు స్పష్టం చేశాయి.మాధవరం పంచాయతీలో గంజి శ్రీను, తాండ్ర రాజేష్, చేకూరి నవీన్ వర్మ సమక్షంలో రావులపాటి నరసింహారావు, ముదిగొండ ఖాదర్‌లతో పాటు మొత్తం 30 కుటుంబాలు వైఎస్సార్సీపీ కండువా కప్పుకున్నాయి. అలాగే, సీఎం కాలనీలో వేల్పుల రవి ఆధ్వర్యంలో వేల్పుల శ్రీను, తుంగ వీరబాబు, వేల్పుల లక్ష్మణ్, విషంపల్లి యశోద, గడ్డం రంగమ్మ, వేల్పుల చిన్న రమణ, గడ్డం లక్ష్మి, గడ్డం ప్రసాద్, దానూరు వెంకన్న బాబు, దానూరు శివ, వేల్పుల నాగరాజు, కొలూరి రాజమ్మ, వేల్పుల ముత్యాలు తదితర 13 కుటుంబాలు స్వచ్ఛందంగా పార్టీలో చేరాయి.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కుక్కునూరు మండలంలో వైఎస్సార్సీపీ మరింత పటిష్టమవుతోందని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం దక్కుతుందని భరోసా కల్పించారు. ప్రజా సేవే లక్ష్యంగా తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గండిగూడెంలో వైభవంగా దొడ్డుల వారి వోణీల వేడుకలు..

ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు!

-టీడీపీ సీనియర్ నేత శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి నాయకుల సందడి.. గండిగూడెంలో ఘనంగా దొడ్డుల వారి వోణీల వేడుకలు!

-చిన్నారులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఆత్మీయ ప్రేమ విందులో పాల్గొన్న శీలం వెంకటేశ్వరరావు మరియు కూటమి ప్రముఖులు!

-పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు.. విజయవంతంగా ముగిసిన శుభకార్యం!

టి. నర్సాపురం, అక్టోబర్ 25:(ప్రజా వీక్షణం)



ఏలూరు జిల్లా, టి. నర్సాపురం మండల పరిధిలోని సుప్రసిద్ధ గండిగూడెం గ్రామంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ దొడ్డుల రాంబాబు అపురూప ఆహ్వానం మేరకు ఆదివారం నాడు వారి సుందర గృహంలో అత్యంత వైభవంగా మరియు కన్నులపండువగా నిర్వహించిన 'దొడ్డుల వారి వోణీల వేడుకలు' అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలుగు దేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, రాష్ట్రంలోనే ఎంతో పేరుగాంచిన పలువురు కూటమి ప్రముఖులు మరియు నాయకులు విశేషంగా విచ్చేసి సందడి చేశారు.ఈ శుభకార్యానికి హాజరైన శీలం వెంకటేశ్వరరావు ఇద్దరు చిన్నారులపై అక్షింతలు వేసి, ఆశీర్వదించారు. అనంతరం దొడ్డుల వారి కుటుంబ సభ్యులు ఎంతో ఆప్యాయంగా, అత్యంత ప్రేమతో ఏర్పాటు చేసిన రుచికరమైన ఆత్మీయ విందు కార్యక్రమంలో అందరూ కలిసి ఉత్సాహంగా, ఆనందంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు, జనసేన సీనియర్ నాయకులు సి.హెచ్. నవీన్ ,పోలవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బచ్చల వెంకటేశ్వరరావు, పోలవరం నియోజకవర్గం టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు చిలక ఏసుబాబు (సుబ్బు తారక్), ముత్యాలమ్మపేట జనసేన నాయకులు పబ్బు జయరాజు, ప్రముఖ నాయకులు రాచబంటు వేములయ్య, నరపాము దుర్గారావు, అలాగే జనసేన యువ నాయకులు పింగుల మధు తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వీరితో పాటు మండలంలోని పలువురు కూటమి నాయకులు, శక్తివంచన లేకుండా పనిచేసే కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విచ్చేసిన గ్రామస్తులు అందరూ కలిసి ఈ శుభవేడుకను అత్యంత ఘనంగా, విజయవంతంగా ముగించారు.



వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

మూడు గ్రామాల్లో పర్యటించిన చిన్నమ్మ, వరలక్ష్మి

తాడేపల్లిగూడెం ప్రతినిధి, అక్టోబరు 25 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం, ఇటుకలగుంట, అమృతపురం గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు బలపరిచిన తాడేపల్లిగూడెం జడ్పీటీసీ అభ్యర్థి సబ్బితి బ్రహ్మయ్య (మాస్టర్) సతీమణి సబ్బితి చిన్నమ్మ, ఎంపీటీసీ అభ్యర్థి వీరమల్లు సుబ్రహ్మణ్యం సతీమణి వీరమల్లు వరలక్ష్మి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూపార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటూ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. స్థానికంగా ప్రజల మద్దతు కూడగట్టేందుకు పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ సందర్భంగా అభ్యర్థులు చిన్నమ్మ, వరలక్ష్మి మాట్లాడుతూ తమను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి

-తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి)

తాడేపల్లిగూడెం ప్రతినిధి, అక్టోబరు 25 (ప్రజా వీక్షణం)

కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) పిలుపునిచ్చారు. పెంటపాడు మండలం నుంచి కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనబుద్ధి రవికిరణ్ ఆదివారం బాబ్జీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఏలూరు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించండి: ఎమ్మెల్యే బడేటి చంటి



-కార్పొరేషన్ ఎన్నికల్లో సమర్థులకే అభ్యర్థిత్వం

-34, 35 డివిజన్లలో విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు

- ప్రగతి పనుల వేగవంతానికి ప్రజలు తీర్పునివ్వాలని పిలుపు

ఏలూరు, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం):

కార్పొరేషన్ ఎన్నికల్లో సమర్థులైన వారికే అభ్యర్థిత్వం ఇవ్వడం జరిగిందని, వారికి అండగా నిలిచి ఆశీర్వదిస్తే భవిష్యత్తులో ఏలూరు నగరం మరింత అభివృద్ధి చెందడానికి అవకాశాలు మెరుగుపడతాయని ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడుతో కలిసి ఆయన స్థానిక 34, 35 డివిజన్ల పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓటర్లను ఆత్మీయంగా పలకరించారు. కూటమి అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లోనూ వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికలు ముగిసి నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టగానే ప్రతి డివిజన్‌లోనూ ప్రగతి పనులను చేపట్టి, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ.. అభివృద్ధి మంత్రంతోనే ఏలూరు కార్పొరేషన్ ఎన్నికల్లో తాము ప్రజల ఓట్లు అడుగుతున్నట్లు స్పష్టం చేశారు. ఇదే జోరులో శనివారపు పేట పరిధిలోని 4వ డివిజన్‌లోనూ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.అలాగే కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ.. గడిచిన రెండున్నరేళ్ల కాలంలో మన కళ్లెదుట కనిపిస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని మాత్రమే ప్రధాన ప్రాతిపదికగా తీసుకుని, ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు మీరావలీ, జనసేన సీనియర్ నాయకులు నారా శేషు, టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, 34వ డివిజన్ కూటమి టీడీపీ అభ్యర్థి గునిపూడి శ్రీనివాసరావు, 35వ డివిజన్ కూటమి టీడీపీ అభ్యర్థి వాసా సత్యనారాయణ, మరియు ఇతర నాయకులు రెడ్డి నాగరాజు, లంకపల్లి మాణిక్యాలరావు, సోమిశెట్టి రాము, బొద్దాని శ్రీను, నడపన దాన భాస్కర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వైభవంగా వాసవి మాత రథోత్సవం


-ఏడు రాష్ట్రాల నుంచి 225 మంది కళాకారులతో కనులవిందుగా శోభాయాత్ర

-వెండి రథంపై అమ్మవారి ఊరేగింపు.. ప్రధాన వీధుల్లో భక్తజన సందోహం

తాడేపల్లిగూడెం ప్రతినిధి అక్టోబరు 25 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో 59వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వాసవి మాత రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఏడు రాష్ట్రాల నుంచి వచ్చిన 225 మంది కళాకారుల ప్రదర్శనలు, మంగళ వాయిద్యాలు, వివిధ నృత్యరూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వెండి రథంపై కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రథోత్సవ కమిటీ చైర్మన్ నారాయణ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఏటా నూతన కళారూపాలకు ప్రాధాన్యమిస్తూ ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత మూడేళ్లుగా రథోత్సవంలో కొత్తదనాన్ని పరిచయం చేస్తూ వివిధ రాష్ట్రాల కళాకారులను ఆహ్వానించి వేడుకలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని నారాయణ రాంబాబు తెలిపారు. ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చారిత్రక ప్రాశస్త్యం కలిగిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో రథోత్సవానికి విశిష్ట స్థానం ఉందన్నారు. ఆర్యవైశ్య సంఘాలు, వాసవి క్లబ్, వనితా క్లబ్, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఐవీఎఫ్‌తో పాటు పలు సంఘాల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు చక్కెర పొంగలి, పులిహోర, శనగల ప్రసాదాలను పంపిణీ చేశారు. రథోత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 75 మంది మహిళలు ప్రదర్శించిన కోలాటం, కోయంబత్తూరు నుంచి తీసుకొచ్చిన కృత్రిమ ఏనుగు, దశావతార రూపాల్లో అమ్మవారి అలంకరణలు, కేరళ సంప్రదాయ వాయిద్యాలు, చిలక నృత్యాలు భక్తులను అలరించాయి. 108 కలశాలతో మహిళలు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక శోభను చేకూర్చారు.బాణసంచా వెలుగులు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి రథయాత్ర భక్తి పారవశ్యాన్ని నింపింది.శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొర్ల రాము, కార్యదర్శి నున్న సుందరం, కోశాధికారి భోగవల్లి రమేష్, ఆలయ కార్యదర్శులు ఆలపాటి చిన్న, ఆలపాటి సత్యనారాయణతో పాటు కమిటీ సభ్యులు ఉత్సవాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. పోలీసుల పర్యవేక్షణలో, ఆర్యవైశ్య సహాయ కమిటీ సహకారంతో రథోత్సవం ప్రశాంతంగా ముగిసింది.





Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
26 సోమవారం అక్టోబర్ 2026
www.prajaveekshanam.in

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

24 గంటలూ పర్యవేక్షణ.. జిల్లాలో 66 ప్రత్యేక బృందాల ఏర్పాటు

అమలాపురం, అక్టోబర్ 25, (ప్రజా వీక్షణం)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లా నోడల్ అధికారిగా డి. రాంబాబు (పీడీ, డీఆర్‌డీఏ) వ్యవహరిస్తుండగా, జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, 19 మండలాల పరిధిలో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 66 బృందాలు 24 గంటలూ విధులు నిర్వహిస్తూ ఎన్నికల ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నాయని వివరించారు. సరిహద్దుల్లో వాహన తనిఖీలు నిర్వహిస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో ముఖ్యమైన నిబంధనలు 1. ప్రభుత్వ స్థలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించడం, జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం నిషేధం. 2. ప్రైవేటు స్థలాల్లో ప్రచార సామగ్రి ఏర్పాటు చేయాలంటే సంబంధిత స్థల యజమాని నుంచి లిఖితపూర్వక అనుమతి తీసుకోవాలి. 3. ప్రచార వాహనాలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించాలి. 4. ఎన్నికల ప్రచార ర్యాలీల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి. 5. దేవాలయాలు, చర్చిలు, మసీదులు తదితర ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు. 6. రూ. 10 వేలకుపైగా విలువైన వస్తువులను రవాణా చేసేటప్పుడు తగిన ఆధారాలు కలిగి ఉండాలి. రూ. 50 వేలకుపైగా నగదు తీసుకెళ్తున్నప్పుడు సంబంధిత ఆధారాలు చూపించాలి. మద్యం రవాణా విషయంలో వర్తించే ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. 7. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త ప్రభుత్వ పనులు ప్రారంభించరాదు. 8. కులం, మతం, భాష, వర్గాల ఆధారంగా ఓట్లు కోరరాదు. 9. ఓటర్లకు నగదు, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలు చూపించి ఓట్లు అడగరాదు. 10. ఎన్నికల ప్రచారాన్ని పోలింగ్‌కు 48 గంటల ముందు నిలిపివేయాలనే నిబంధనను సంబంధిత ఎన్నికలకు వర్తించే విధంగా పాటించాలి. 11. ప్రభుత్వ వాహనాలను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు. ప్రభుత్వ అధికారులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదు. 12. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలి. అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితులు అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సంబంధిత ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితులను పాటించాలి. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం వ్యయ పరిమితులు ఇలా ఉన్నాయి:మున్సిపల్ చైర్‌పర్సన్: రూ. 10



లక్షలు,మున్సిపల్ కౌన్సిలర్: రూ. 5 లక్షలు,జడ్పీటీసీ సభ్యుడు: రూ. 8 లక్షలు,ఎంపీటీసీ సభ్యుడు: రూ. 4 లక్షలు, 10 వేలలోపు జనాభా గల పంచాయతీ సర్పంచ్: రూ. 2.50 లక్షలు,10 వేలలోపు జనాభా గల పంచాయతీ వార్డు సభ్యుడు: రూ. 60 వేలు ,10 వేలకుపైగా జనాభా గల పంచాయతీ సర్పంచ్: రూ. 4 లక్షలు,10 వేలకుపైగా జనాభా గల పంచాయతీ వార్డు సభ్యుడు: రూ. 1 లక్ష.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

బొల్లారంలో ఘనంగా గ్యారీమ్ దావత్ వేడుకలు

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

బొల్లారం డివిజన్ పరిధిలోని 272 బీసీ కాలనీలో ఉన్న హజరత్ ఘోస్-ఇ-అజామ్ దస్తగిర్ దర్గాలో నిర్వహించిన గ్యారీమ్ దావత్ వేడుకల్లో జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.స్థానిక మైనారిటీ సోదరుల ఆహ్వానం మేరకు హాజరైన బాల్ రెడ్డికి కాలనీ వాసులు శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని, ముస్లిం సోదరులకు గ్యారీమ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సభ్యులు ఘోస్, లడ్డు, అబ్దుల్ కరీమ్, అబ్దుల్ సలీమ్, అఫ్రోజ్, నభి, అబ్దుల్ ఖదిర్, మక్కముద్దీన్‌తో పాటు స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.



జయలక్ష్మి నగర్‌లో వైభవంగా మహా రుద్రాభిషేకం

-ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి హరీశ్ రావు, ఆదర్శ్ రెడ్డి పాల్గొనడం

-130 మంది వేద పండితులతో రుద్రాభిషేకం.. 5 లక్షల పుష్పాలతో పుష్పార్చన

పటాన్‌చెరు, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం)

పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ డివిజన్ జయలక్ష్మి నగర్ ఫేజ్-2లో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం మహా రుద్రాభిషేకం, పుష్పార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.బీరంగూడకు విచ్చేసిన హరీశ్ రావుకు బీరంగూడ కమాన్ వద్ద భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో హరీశ్ రావుతో పాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా 130 మంది వేద పండితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య మహా రుద్రాభిషేకం నిర్వహించగా, ఐదు లక్షల పుష్పాలతో పుష్పార్చన చేపట్టారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హరీశ్ రావు అమీన్‌పూర్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన విందులో పాల్గొన్నారు.





6వ వార్డులో పిండి అమరావతి ప్రచారం జోరు!





ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న జనసేన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్

అమలాపురం, ప్రజా వీక్షణం:

అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పిండి అమరావతి ప్రచారం జోరుగా సాగింది. వార్డులో ఆమె నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి ఓటర్ల నుంచి స్పందన లభించింది. గతంలో ఇదే వార్డుకు కౌన్సిలర్‌గా పనిచేసిన ఆమె వార్డు అభివృద్ధికి కృషి చేశారని, ప్రజలతో ఉన్న పరిచయాలు, గతంలో చేసిన సేవలు తనకు మద్దతుగా నిలుస్తున్నాయని ఆమె వర్గీయులు పేర్కొంటున్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి, జనసేన పార్టీ నాయకుడు నల్లా శ్రీధర్ పాల్గొని ప్రజలను కలిశారు. కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని వారు ఓటర్లను అభ్యర్థించారు.నల్లా శ్రీధర్ ప్రచార కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లభిస్తోందని పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ప్రజల మద్దతు లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలుఈ సందర్భంగా పిండి రాజా మాట్లాడుతూ, 6వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా తన తల్లి పిండి అమరావతికి అవకాశం కల్పించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, నల్లా శ్రీధర్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో గునిశెట్టి ఒలీ బాబా, గోకరకొండ లక్ష్మణరావు, పిండి శేషు, కల్వకొలను తాతాజీ, నల్ల చిట్టి, ఏడిద శ్రీను, అయితా బత్తుల కరుణ్ తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



28వ వార్డులో మోకా వెంకట సుబ్బారావు ప్రచార హోరు!

ఇంటింటా ప్రచారానికి విశేష స్పందన.. ఓటర్లను కలుస్తూ ముందుకు సాగుతున్న బీజేపీ అభ్యర్థి...

(అమలాపురం, ప్రజా వీక్షణం)

అమలాపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 28వ వార్డులో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆ పార్టీ సీనియర్ నేత మోకా వెంకట సుబ్బారావు ప్రచారంలో దూకుడు పెంచుతూ ముందుకు సాగుతున్నారు. జనాశన రాష్ట్ర నాయకులు నల్లా అజయ్ నల్లా సంజయ్ ఇంటింటా పర్యటిస్తూ ఓటర్లను నేరుగా కలుసుకోవడం ద్వారా తన ప్రచారాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు..ఆదివారం నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో మోకా వెంకట సుబ్బారావు వార్డులోని ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ, తనకు మద్దతు అందించాలని కోరారు. ప్రజలతో మమేకమవుతూ సాగిన ఆయన ప్రచారం వార్డులో రాజకీయ సందడిని పెంచింది. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను నేరుగా కలిసి వారి మద్దతు కోరడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు.కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా జనశన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వార్డులో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలుసుకోవడం ద్వారా ప్రచారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో ధి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోణం సత్య వరప్రసాద్, చల్లా రామకృష్ణ అయ్యాల భాష బండి శ్రీను తదితరులు పాల్గొన్నారు...



GENERAL NEWS
26 సోమవారం అక్టోబర్ 2026
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం
దినపత్రిక

సమస్యాత్మక సున్నితమైన ప్రాంతాలను ముందుగా గుర్తించి అధికారులు అప్రమత్తం గా ఉండాలి.

ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకురాలు పి. ప్రశాంతి.

అమలాపురం, అక్టోబర్ 25, (ప్రజా వీక్షణం)

సమస్యాత్మక సున్నితమైన ప్రాంతాలను ముందుగా గుర్తించి అధికారులు అప్రమత్తం గా ఉండాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎన్నికల పరిశీలకురాలు పి. ప్రశాంతి ఐఏఎస్ తెలియజేశారు.ఆదివారం అయినవిల్లి, అంబాజీపేట పి గన్నవరం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించి, ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సన్నద్ధత, అధికారుల కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ముందస్తు ఏర్పాట్ల వివరాలను పరిశీలకురాలు తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిర్దేశించిన విధివిధానాలను తూచ తప్పకుండా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.జిల్లా ఎన్నికల పరిశీలకురాలు వెంట ఉద్యాన శాఖ జెడి బి రమణ, అయినవిల్లి తహసిల్దార్ విద్యాపతి, అంబాజీపేట తహసిల్దార్ చిన్నబాబు, పి గన్నవరం తహసిల్దార్ పల్లవి డి ఎల్ డి వో లు,ఎంపీడీవోలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మోచేర్ల సత్యకృష్ణ విస్తృత ప్రచారం కమలం గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థన

నర్సాపురం అక్టోబర్ 25 ప్రజా వీక్షణం విలేకరి.

నర్సాపురం 6వ వార్డు బిజెపి అభ్యర్థి మోచేర్ల సత్యకృష్ణ ఆదివారం వార్డు పరిధిలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వార్డులో 'ఇంటింటికి గడపగడపకు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్తూ స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. రాబోయే రోజుల్లో వార్డును అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్తానని, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మరియు వార్డులో నిరంతర అభివృద్ధి సాధ్యం కావాలంటే కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.అభివృద్ధి, సుపరిపాలనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న తమకు రాబోయే ఎన్నికల్లో ఓటర్లు అండగా నిలవాలని, కమలం (బిజెపి) గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని శ్రీ మోచేర్ల సత్యకృష్ణ ఈ సందర్భంగా వార్డు ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలోఆరవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మోచర్ల సత్య కృష్ణ , డాక్టర్ ఇలపకుర్తి ప్రకాష్ , గునిశెట్టి శ్రీనివాస్ , గుడాల ఈశ్వరచంద్ర , కొప్పర్తి వెంకట్ , భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు రావూరి ప్రసాద్ గంధం సత్యంబాబు కోరాడి పాపారావు కార్యకర్తలు నాయకులు పాల్గొనడం జరిగింది.



అమలాపురం మున్సిపాలిటీ 26 వ వార్డులో వైయస్సార్సీపి చైర్మన్ అభ్యర్థి దూడల విరీత దేవి విస్తృత ప్రచారం

అమలాపురం, అక్టోబర్ 25, (ప్రజా వీక్షణం)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపాలిటీ 26 వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైయస్సార్సీపి చైర్మన్ అభ్యర్థి దూడల విరీత దేవి,26వ వార్డు వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థి గొవ్వల రాజేష్.ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి కరపత్రములు అందజేసి, ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు ,స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.



వైసీపీ చైర్మన్ అభ్యర్థి కావలి రామ సీతకు పెరిగిన ప్రజాదరణ..

చర్చిలలో పాస్టర్లచే ప్రత్యేక ఆశీర్వాదాలు.

నర్సాపురం అక్టోబర్ 25 ప్రజా వీక్షణం విలేకరి.

నర్సాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిని కావలి రామసీత నాని ప్రచారంలో జోరుగా దూసుకుపోతున్నారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల మద్దతును కూడగడుతూ, నేడు ఆమె పట్టణంలోని పలు ప్రముఖ చర్చిలను సందర్శించారు చర్చిలలోని పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు కావలి రామసీత కి ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కావలి రామ సీత నాని ఘన విజయం సాధించాలని పాస్టర్లు మరియు సంఘ పెద్దలు హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.కావలి రామసీత నాని మాట్లాడుతూ: "నరసాపురం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. నేడు పలు చర్చిలలో దైవజనులు, పాస్టర్లు నాపై ఉంచిన నమ్మకానికి, వారు అందించిన ఆశీస్సులకు నా కృతజ్ఞతలు. వైఎస్సార్ సీపీ నాయకులు మరియు కార్యకర్తల సమిష్టి కృషితో, నరసాపురం మున్సిపాలిటీపై వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేస్తాం. పట్టణ ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నన్ను, వైస్సార్సీపీ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కావలి వెంకటరత్నం తో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు



అమలాపురం మున్సిపాలిటీ ఐదవ వార్డులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ ప్రచారం

అమలాపురం, అక్టోబర్ 25, (ప్రజా వీక్షణం)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపాలిటీ 5వ వార్డులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్ ప్రచారం చేశారు. ఐదవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి విత్తనాల మూర్తితో కలిసి వార్డులో ఓటర్లను తమ అమూల్యమైన ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చెల్లుబోయిన శ్రీను కోరారు.



ఐదవ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం

లిఅమలాపురం (ప్రజా వీక్షణం విలేకరి):

అమలాపురం మున్సిపాలిటీ ఐదవ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థి విత్తనాల మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి దూడల విరిత దేవి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీకాంత్ సైతం ప్రచార కార్యక్రమంలో పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా వార్డులోని ఓటర్లను కలిసి తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఐదవ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో కూటమి ఎంపిపి అభ్యర్థి నాగమణి పూజలు

తాళ్లరేవు, అక్టోబర్ 25(ప్రజా వీక్షణం విలేఖరి):

కూటమి ఎంపిపి అభ్యర్థి చిట్టూరి నాగమణి మట్లపాలెం మహాలక్ష్మి అమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పటవల– 1 కూటమి ఎంపిటిసి అభ్యర్థి చెక్కా అయ్యారావు, స్థానిక కూటమి నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి ఆమె కొత్తూరులో గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలలో అండగా నిలవాలని కోరారు. మండలంలో కూటమి ఎంపిక చేసిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తాను పోటీ చేస్తున్న నీలపల్లి తో పాటు అన్ని స్థానాలు కూటమి అభ్యర్థులు విజయం సాధించడం తథ్యమని నాగమణి ధీమా వ్యక్తం చేశారు.

జోరుగా "సంగాడి నాగరాజు" ఎన్నికల ప్రచారం

తాళ్లరేవు, అక్టోబర్ 25 (ప్రజా వీక్షణం విలేఖరి):

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని కోరంగి– 2 ఎంపీటీసీ కూటమి టిడిపి అభ్యర్థి సంగాడి నాగరాజు ప్రచారం జోరుగా సాగుతోంది. స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆదివారం గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి అభివృద్ధి సంక్షేమం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా కోరంగి–2 ఎంపిటిసి కూటమి అభ్యర్థి నాగరాజుకు సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కూటమి నాయకులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి మహిళా నాయకులు పెమ్మాడి కృష్ణవేణి, మాజీ ఎంపీటీసీ వైదాడి శ్రీనివాస్, బిజెపి నాయకులు కొపనాతి దత్తాత్రేయ వర్మ, నాయకులు చింతా సత్యనారాయణ (అబ్బులు), పెసింగి ఈశ్వరరావు, పంతాడి ధర్మారావు, కొప్పాడి వాసు, దోమ వీరబాబు, పంతాడి శివశంకర్, దోమ సాయి, రేకాడి నూకరాజు, బొడ్డు మహాలక్ష్మి, పాలెపు నరసింహమూర్తి, పెమ్మాడి నాగరాజు, సంగాడి వీరబాబు, విశ్వనాథపల్లి కనకరాజు, పెమ్మాడి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



వార్డు వార్డున గిర్రున ఫ్యాన్ గాలి

-ఏడవ వార్డులో జాహ్నవికి జై!

విశాఖ/మధురవాడ(ప్రజా వీక్షణం ప్రతినిధి) అక్టోబర్ 25:

జీవీఎంసీ ఏడవ వార్డులో ఫ్యాన్ గాలి బలంగా వీస్తోంది. శివశక్తి నగర్, శారదా నగర్, మారికవలసల్లో వైసీపీ అభ్యర్థి పోతిన జాహ్నవి గడపగడప ప్రచారం హోరెత్తించింది.సీనియర్ నేత బాగాది లక్ష్మణ్ సారథ్యంలో జాహ్నవి ప్రతి ఇంటి తలుపు తట్టారు. ఫ్యాన్ గుర్తుకే ఓటేయమంటూ అభ్యర్థిస్తున్న ఆమెకు జనం పూల వర్షం కురిపించి, అడుగడుగునా హారతులు పట్టారు. మహిళలు, యువత 'జాహ్నవక్కకే మా మద్దతు' అంటూ నినాదాలతో హోరెత్తించారు.యువ నాయకురాలైన జాహ్నవిని గెలిపిస్తే వార్డు రూపురేఖలే మారిపోతాయి. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, లైట్లు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటారని వైసీపీ సీనియర్ నాయకుడు బాగాది లక్ష్మణ్ భరోసా ఇచ్చారు.తనను గెలిపిస్తే మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తానని, నమూనా వార్డుగా తీర్చిదిద్దుతానని జాహ్నవి హామీ ఇచ్చారు.ప్రచారంలో లోకనాథం, కూన రమణ, రంగస్వామి, చింతాడ శ్రీను, తదితర నేతలు, మహిళా విభాగం ఉత్సాహంగా పాల్గొన్నారు.



క్రిస్ట్ ప్రేయర్ చాపెల్ ఆరాధన చర్చిని సందర్శించిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు

నర్సాపురం అక్టోబర్ 25 ప్రజా వీక్షణం విలేకరి.

నర్సాపురం 24వ వార్డులో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఈరోజు క్రిస్ట్ ప్రేయర్ చాపెల్ ఆరాధన చర్చిని సందర్శించారు చైర్మన్ అభ్యర్థి కొత్తపల్లి శైలజ విజయం వరించేలా ప్రార్థన చేయమని సుబ్బారాయుడు అన్నారు.చర్చి వద్దకు చేరుకున్న కొత్తపల్లి సుబ్బారాయుడికి సంఘ కాపరులు పాస్టర్ ఏ.డి.వి. ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ కాపరులు ఏ.డి.వి. ప్రసాద్‌తో కొత్తపల్లి సుబ్బారాయుడు పలు విషయాలపై చర్చించారు. అనంతరం చైర్మన్ అభ్యర్థి కొత్తపల్లి శైలజ మరియు వార్డ్ కౌన్సిలర్ భారతి సురేష్ వారి విజయానికి సుబ్బారాయుడు ప్రచారంలో హోరెత్తించారు చర్చి వద్ద కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఆయన తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి 24వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు 24వ వార్డు ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుగ్గిలపు మురళి. గంధం రవి రామారావు. చినిమిల్లి శ్రీనివాస్. కోప్పినీడి చత్రపతి శివాజీ. గోరు సత్యనారాయణ. స్థానిక నాయకులు, చర్చి ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు



ప్రజావీక్షణం
దినపత్రిక

SPORTS/ BUSINESS

26 సోమవారం అక్టోబర్ 2026

II

www.prajaveekshanam.in



మహిళల టీ20 ప్రపంచ కప్ కోసం పాక్ భారీ ప్రతిపాదన..

భారత్‌కు ఒక షరతు!

2028లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే, ఇరు దేశాల మధ్య ఉన్న రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత జట్టు ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదిక అయిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్‌ను 'హైబ్రిడ్ మోడల్' పద్ధతిలో నిర్వహించాలని ఐసీసీ శుక్రవారం ప్రకటించింది. సెప్టెంబర్ 7 నుంచి అక్టోబర్ 1 వరకు జరగనున్న ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొంటాయి.ఇటీవల 2025లో జరిగిన పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీని కూడా ఇదే హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించిన సంగతి తెలిసిందే. అప్పుడు కూడా పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వగా.. భారత జట్టు తన మ్యాచ్‌లన్నీ యూఏఈలోనే ఆడింది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్‌లో విజేతగా నిలిచింది. ఛాంపియన్స్ ట్రోఫీలోని 15 మ్యాచ్‌లలో 10 మ్యాచ్‌లకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చింది. ఇప్పుడు మహిళల టీ20 ప్రపంచకప్‌కు కూడా అదే ఫార్ములాను అనుసరించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) భావిస్తోంది.ఈ విషయంపై పీసీబీ వర్గాలు మాట్లాడుతూ.. మహిళల టీ20 ప్రపంచకప్ నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని, ఛాంపియన్స్ ట్రోఫీ తరహాలోనే ఈ టోర్నీని కూడా విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశాయి. "భారత జట్టు ప్రమేయం లేని గ్రూప్ మ్యాచ్‌లు, నాకౌట్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని పీసీబీ అధికారి ఒకరు తెలిపారు. పాకిస్థాన్, దుబాయ్ మధ్య ప్రయాణ దూరం తక్కువగా ఉండటం, లాజిస్టిక్స్ ఖర్చులు కూడా తగ్గడం వల్ల యూఏఈనే తటస్థ వేదికగా ఎంచుకోవడం ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రపంచంలోని అగ్రశ్రేణి జట్లలో ఒకటైన భారత్, ఈ టోర్నీలో నాకౌట్ దశకు చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ భారత జట్టు ఫైనల్‌కు చేరితే, ఆ మ్యాచ్ యూఏఈలోనే జరుగుతుంది. ఒకవేళ భారత్ ఫైనల్‌కు అర్హత సాధించకపోతే, తుదిపోరుకు లాహోర్ నగరం ఆతిథ్యం ఇస్తుందని పీసీబీ వర్గాలు స్పష్టం చేశాయి. ఐసీసీ ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా పాకిస్థాన్‌కు హోస్టింగ్ ఫీజుతో పాటు టోర్నీ నిర్వహణ ఖర్చులకు నిధులు లభిస్తాయి. ఈ మెగా టోర్నీ నిర్వహణతో దేశంలో మహిళల క్రికెట్‌కు మరింత ఆదరణ లభిస్తుందని పీసీబీ ఆశిస్తోంది.

మూడో స్థానంలో వైభవ్ విఫలం..

భారత జట్టు ప్రయోగంపై అశ్విన్ అసంతృప్తి

న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపడం సరైన నిర్ణయం కాదని భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఆ స్థానంలో వైభవ్ తీవ్రంగా ఇబ్బంది పడ్డాడని, అది "అతని కప్ ఆఫ్ టీ కాదని" స్పష్టం చేశాడు. ఈ ప్రయోగం విఫలమైందని అశ్విన్ పేర్కొన్నాడు.క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో గాయపడిన ఇషాన్ కిషన్ స్థానంలో జట్టులోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీ, మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన వైభవ్.. 8 బంతులు ఎదుర్కొని కేవలం 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. అయితే, ఈ మ్యాచ్‌లో 180 పరుగుల లక్ష్యాన్ని భారత్ 4 వికెట్ల తేడాతో ఛేదించి విజయం సాధించింది. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా కొనసాగారు.మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన అశ్విన్.. వైభవ్ ప్రదర్శనను విశ్లేషించాడు. "ఇది ఒక మిస్. వైభవ్ లాంటి యువ క్రికెటర్‌కు 'మిస్' అని చెప్పడం తొందరపాటు అవుతుందేమో. కానీ హిట్టా, మిస్సా అనే రెండు ఆప్షన్లు మాత్రమే ఉండటంతో నేను ఈ మాట చెబుతున్నా. అతడు నీటిలోంచి బయటపడ్డ చేపలా కనిపించాడు. ఆడిన 8 బంతుల్లోనూ బంతిని గట్టిగా బాదడానికే ప్రయత్నించాడు" అని వివరించాడు.వైభవ్ బంతిని సరిగ్గా టైమింగ్ చేయలేకపోయాడని, ఆ సమయంలో క్రీజులో ఉన్న సీనియర్ పార్టనర్ అతడి వద్దకు వెళ్లి 'ప్రశాంతంగా ఉండు, శరీరానికి దగ్గరగా ఆడు, బంతిని సరిగ్గా గమనించు' అని చెప్పి ఉండాల్సిందని అశ్విన్ అన్నాడు. "ఆరో ఓవర్‌లో బ్యాటింగ్‌కు రావడం అతడికి సరిపోయే విషయం కాదు" అని తేల్చి చెప్పాడు.ఒకవేళ జట్టు ఇదే ఓపెనింగ్ జోడీతో ముందుకు వెళ్లాలనుకుంటే, గతంలో భారత్ తరఫున ఆడిన అనుభవం ఉన్న సంజూ శాంసన్‌ను మూడో స్థానంలో ఆడించడం సరైన నిర్ణయం అవుతుందని అశ్విన్ సూచించాడు. అదే సమయంలో భారత మిడిల్ ఆర్డర్ ప్రదర్శనను అతను ప్రశంసించాడు. తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, రమన్‌దీప్ సింగ్‌ల ఆటతీరు 'బిగ్ హిట్' అని కొనియాడాడు.

టీమిండియాలో ఆడిన ఆనందం నిలవలేదు: మాజీ స్పిన్నర్ ఆవేదన

-టీమిండియాలో చోటు కోల్పోయాక 18 నెలలు డిప్రెషన్‌లో ఉన్నట్లు వెల్లడి

-కుటుంబానికి చెప్పలేక ఒంటరిగా బాధను అనుభవించానన్న మిశ్రా

-గాడ్‌ఫాదర్ లేకపోవడంతో ప్రదర్శనతోనే నిరూపించుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్య

-ఇటీవలే ఢిల్లీ క్యాపిటల్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియామకం



టీమిండియా మాజీ స్పిన్నర్ అమిత్ మిశ్రా తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న తీవ్ర మానసిక ఒత్తిడి గురించి సంచలన విషయాలను వెల్లడించాడు. భారత జట్టులో స్థానం కోల్పోయిన అనంతరం దాదాపు 18 నెలల పాటు తాను తీవ్ర కుంగుబాటుకు (డిప్రెషన్) లోనయ్యానని ఆయన తెలిపాడు. ప్రముఖ వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రాతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో మిశ్రా ఈ విషయాలను పంచుకున్నాడు.''భారత జట్టుకు ఆడిన సంతోషం నాకు ఎంతో కాలం నిలవలేదు. జట్టులో చోటు కోల్పోవడంతో నా కెరీర్ సందిగ్ధంలో పడింది. నేనేం తప్పు చేశానా? అని నన్ను నేనే ప్రశ్నించుకునేవాడిని. ఆ బాధను పంచుకోవడానికి నాకు ఎవరూ ఉండేవారు కాదు. నా పరిస్థితి చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందకూడదనే ఉద్దేశంతో వారితో కూడా ఈ విషయాలు చెప్పలేదు. నా జీవితంలోనే అది అత్యంత కష్టమైన కాలం'' అని మిశ్రా ఆవేదన వ్యక్తం చేశాడు.జాతీయ జట్టు నుంచి తొలగించిన తర్వాత, కనీసం దులీప్ ట్రోఫీ లేదా ఇండియా-ఏ జట్లలో కూడా తనకు అవకాశం దక్కలేదని మిశ్రా గుర్తుచేసుకున్నాడు. ఒక సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని, ఒక సెలక్టర్ 'నువ్వు సరిగా ఆడటం లేదు' అని నేరుగా తన ముఖం మీదే చెప్పారని వివరించాడు. ఆ తర్వాతే తాను కేవలం జాతీయ జట్టు గురించే ఆలోచిస్తూ దేశవాళీ క్రికెట్‌ను విస్మరించానని గ్రహించినట్లు పేర్కొన్నాడు. తదనంతరం బ్యాటింగ్‌పై కూడా దృష్టి సారించి తిరిగి దులీప్ ట్రోఫీలో చోటు సంపాదించానని తెలిపాడు. తనకు ఎలాంటి 'గాడ్‌ఫాదర్' లేనందున, ప్రతిసారీ అత్యుత్తమ ప్రదర్శనతోనే తనను తాను నిరూపించుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు.మిశ్రా ఇటీవల



డిసెంబర్‌లో తేల్చేస్తా..

ఐపీఎల్ రీఎంట్రీపై మౌనం వీడిన ధోనీ

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ.. తన ఐపీఎల్ భవిష్యత్తుపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించే ప్రయత్నం చేశాడు. పిక్క కండరాల గాయం కారణంగా 2026 ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరమైన ధోనీ, తన రీఎంట్రీపై తొలిసారిగా స్పందించాడు. తన ఫిట్‌నెస్‌పై డిసెంబర్ లోపు ఒక స్పష్టత వచ్చాక, ఐపీఎల్‌లో కొనసాగడంపై తుది నిర్ణయం తీసుకుంటానని వెల్లడించాడు.బెంగళూరులో జరిగిన ఓ ఆరోగ్య కార్యక్రమానికి హాజరైన ధోనీని.. మరో సీజన్ ఆడే అవకాశం ఉందా? అని ప్రశ్నించగా.. "డాక్టర్, నేను ముందుగా అన్ని పరీక్షలు చేయించుకోవాలి. మీరు నాకు పూర్తి నివేదిక ఇవ్వాలి. ఆ తర్వాత, డిసెంబర్ లోపు మరో సీజన్ ఆడేంత బలంగా నేను ఉన్నానో లేదో చూసుకోవాలి" అని అన్నాడు.అంతటితో ఆగకుండా, "ఒకవేళ నేను ఆడలేకపోయే పరిస్థితి వస్తే, ఈ పాత వింటేజ్ వాహనం రోడ్డుపై సరిగ్గా నడిచేలా చూడాల్సిన బాధ్యత మీదే (వైద్యులదే). కాబట్టి ఒత్తిడంతా వారిపైనే ఉంది" అని చమత్కరించాడు. 2027 ఐపీఎల్ నాటికి దాదాపు 46 ఏళ్లకు చేరువకానున్న ధోనీ, తన కెరీర్‌లో 278 ఐపీఎల్ మ్యాచ్‌లలో 38.30 సగటుతో 5,439 పరుగులు సాధించాడు. అతడి సారథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. అయితే, గత రెండు సీజన్లలో రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో సీఎస్‌కే ప్రదర్శన నిరాశపరిచింది. 2025లో చివరి స్థానంలో నిలవగా, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ నేపథ్యంలో, ధోనీ ఫిట్‌గా ఉంటే కచ్చితంగా జట్టులో కొనసాగాలని సీఎస్‌కే యాజమాన్యం కూడా ఆశిస్తోంది. డిసెంబర్‌లో మహీ తీసుకోబోయే నిర్ణయం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



సూర్య సినిమా కోసం 'కల్ట్' టైటిల్ అడిగారు..

కానీ నేను ఇవ్వలేదు: విశ్వక్ సేన్



టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తాజాగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'జఖూ' (కల్ట్). ఈ సినిమా టైటిల్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త టాలీవుడ్ వర్గాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించబోయే ఒక భారీ సినిమా కోసం చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఈ 'కల్ట్' టైటిల్‌ను తమకు ఇవ్వాలని అడిగినట్లు విశ్వక్ సేన్ స్వయంగా వెల్లడించారు. తమ సినిమా కథకు మరియు నేపథ్యానికి ఈ టైటిల్ అత్యంత సరిగ్గా సరిపోతుందని వారు భావించినట్లు ఆయన తెలిపారు.

అయితే, ఆ టైటిల్ తన సినిమాలోని పాత్రకు, కథాంశానికి మరింత పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని గట్టిగా నమ్మడంతో, సూర్య టీమ్ అడిగినప్పటికీ తాను ఆ టైటిల్‌ను ఇవ్వడానికి సున్నితంగా నిరాకరించినట్లు విశ్వక్ సేన్ స్పష్టం చేశారు. అయితే, అది సూర్య నటించబోయే ఏ సినిమాకు సంబంధించిన టైటిల్ అనే దానిపై మాత్రం ఆయన ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ మేటర్ టాలీవుడ్ మరియు కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారగా, దీనికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి.

సెన్సార్ బోర్డులో భారీ డేటా లీక్..

ఆన్‌లైన్‌లో 500 సినిమాల స్క్రిప్ట్‌లు, కట్ ఆర్డర్లు

-సెన్సార్ బోర్డులో భారీ డేటా ఉల్లంఘన

-500కు పైగా సినిమాల సర్టిఫికేషన్ రికార్డులు లీక్

-షూటింగ్ స్క్రిప్ట్‌లు, కట్ ఆర్డర్లు వంటి కీలక పత్రాలు బహిర్గతం

-'ఈ-సినీప్రమాణ్' పోర్టల్ నుంచి సమాచారం బయటకు

-ఘటనపై దర్యాప్తు చేస్తున్నామన్న సీబీఎఫ్‌సీ, సెక్యూరిటీ ఆడిట్



'కేంద్ర ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డు' (సీబీఎఫ్‌సీ)లో భారీ భద్రతా వైఫల్యం వెలుగుచూసింది. సుమారు 500కు పైగా ఫీచర్ ఫిల్మ్‌లతో సహా ఇతర చిత్రాలకు సంబంధించిన అత్యంత కీలకమైన సర్టిఫికేషన్ రికార్డులు ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. సినిమాల సెన్సార్ అనుమతుల కోసం నిర్మాతలు దరఖాస్తు చేసుకునే అధికారిక ఆన్‌లైన్ వ్యవస్థ 'ఈ-సినీప్రమాణ్' పోర్టల్ నుంచే ఈ సమాచారం బయటకు పొక్కినట్లు తేలింది. ఈ ఘటన సెన్సార్ బోర్డు పనితీరు, డిజిటల్ భద్రతా ప్రమాణాలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది.లీకైన సమాచారంలో సినిమాల పూర్తి కాపీలు లేనప్పటికీ, వాటికి సంబంధించిన అత్యంత సున్నితమైన డాక్యుమెంట్లు ఉన్నాయి. వీటిలో సినిమాల షూటింగ్ స్క్రిప్ట్‌లు, సెన్సార్ బోర్డు సూచించిన కట్‌ల జాబితా (కట్ ఆర్డర్లు), థియేటర్లలో విడుదల కోసం సమర్పించిన ఇతర ముఖ్యమైన పత్రాలు ఉన్నట్లు సమాచారం. ఒక సినిమా కథ, పాత్రల వివరాలు, తొలగించిన సన్నివేశాలు వంటివి విడుదలకు ముందే బయటకు రావడం వల్ల నిర్మాతలకు ఆర్థికంగా, సృజనాత్మకంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.ఈ కీలక డాక్యుమెంట్లన్నీ 'ఇంటర్నెట్ ఆర్కైవ్' అనే వెబ్‌సైట్‌లో కొద్ది రోజుల పాటు డౌన్‌లోడ్‌కు అందుబాటులో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఇంటర్నెట్ ఆర్కైవ్ యాజమాన్యం వెంటనే స్పందించి, ఆ సమాచారాన్ని తమ ప్లాట్‌ఫామ్ నుంచి పూర్తిగా తొలగించింది. అంతేకాకుండా ఈ వ్యవహారాన్ని సైబర్ భద్రతా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ సంస్థ నిర్ధారించింది.ఈ డేటా లీక్ ఘటనపై సెన్సార్ బోర్డు స్పందించింది. తమ పోర్టల్‌లోకి అనధికారిక యాక్సెస్ జరిగిందన్న ఆరోపణలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపింది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు పోర్టల్‌కు సంబంధించిన పూర్తిస్థాయి సెక్యూరిటీ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ప్రాథమిక దర్యాప్తులో ఏ నిర్మాత ఖాతా కూడా హ్యాకింగ్‌కు గురైనట్లు ఆధారాలు లభించలేదని సీబీఎఫ్‌సీ స్పష్టం చేసింది. దర్యాప్తు పూర్తయితే గానీ ఈ భద్రతా వైఫల్యానికి గల కచ్చితమైన కారణాలు, నష్టంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం లేదు.



ఓటీటీలోకి మెగాస్టార్.. 'మెగావర్స్' షోతో రాబోతున్న చిరంజీవి!

మెగాస్టార్ చిరంజీవి వెండితెరపైనే కాకుండా ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పైనా తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఒక సరికొత్త సెలబ్రిటీ టాక్ షోతో ఓటీటీ అరంగేట్రం చేయనున్నారు. ఈ ఆసక్తికరమైన షోకు 'మెగావర్స్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ వార్తతో మెగా అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ టాక్ షో ద్వారా చిరంజీవి తన ఐదు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రయాణం, రాజకీయ జీవితంలోని కీలక ఘట్టాలు, చిత్ర పరిశ్రమలో తన అనుభవాలను ప్రేక్షకులతో పంచుకోనున్నారు. ముఖ్యంగా, ఇప్పటివరకు ఆయన బహిరంగంగా ఎక్కడా వెల్లడించని ఎన్నో వ్యక్తిగత విషయాలను, ఆసక్తికరమైన సంఘటనలను ఈ షోలో ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. ఇది ఆయన జీవితంలోని మరో కోణాన్ని అభిమానులకు పరిచయం చేయనుంది.సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు ఇలా ఓటీటీలో ప్రత్యేక షోతో ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'మెగావర్స్' షో ద్వారా చిరంజీవి చెప్పబోయే తెలియని నిజాలు, పంచుకోబోయే అనుభవాల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ షోకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడనున్నాయి.

రజనీకాంత్ 'ధర్మన్'లో నయనతార..

ఐదోసారి జంటగా బ్లాక్‌బస్టర్ జోడీ!



సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ధర్మన్' గురించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో కథానాయికగా లేడీ సూపర్‌స్టార్ నయనతార నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి తెరదించుతూ, దర్శకుడు అశ్వత్ మారిముత్తు సోషల్ మీడియా వేదికగా ఆమెకు స్వాగతం పలికారు. దీంతో రజనీ-నయన్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.ఆదివారం సాయంత్రం 'ధర్మన్' చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, తమ సోషల్ మీడియా ఖాతాలో "కొన్ని కళ్లు అన్నీ చెప్పేస్తాయి. ఆ తేజస్సు రాబోతోంది" అంటూ ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. ఆ తర్వాత కొద్ది గంటలకే దర్శకుడు అశ్వత్ మారిముత్తు స్పందిస్తూ, నయనతారను ట్యాగ్ చేసి "మా టీమ్‌లోకి స్వాగతం మేమ్" అని పోస్ట్ చేయడంతో ఈ వార్త ఖరారైంది.రజినీకాంత్, నయనతార కాంబినేషన్ వెండితెరపై ఎప్పుడూ ప్రత్యేకమే. వీరిద్దరూ కలిసి ఇప్పటివరకు 'చంద్రముఖి' (2005), 'కుచేలన్' (2008), 'దర్బార్' (2020), 'అన్నాత్తే' (2021) చిత్రాల్లో నటించారు. ఇప్పుడు 'ధర్మన్' వీరి కాంబినేషన్‌లో రాబోతున్న ఐదో సినిమా కావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ఇప్పటికే ఈ సినిమా మూడు షెడ్యూళ్ల చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు దర్శకుడు గతంలోనే ప్రకటించారు. ఇటీవల మైసూర్ షెడ్యూల్‌లో పాల్గొన్న నటి రాశీ ఖన్నా, రజినీకాంత్, రామ్ పోతినేనితో కలిసి ఉన్న ఫోటోలను పంచుకున్నారు. "మైసూర్‌లో ఉదయాన్నే రజనీ సార్, రామ్‌తో కలిసి వర్కౌట్లు, ఆలయాల సందర్శన, నవ్వులతో గడిపాను" అంటూ ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.లోకనాయకుడు కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్. డిస్నీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా, ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. భారీ తారాగణం, ప్రముఖ సాంకేతిక నిపుణులతో 'ధర్మన్' చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

యూట్యూబ్‌లో టాప్ ట్రెండింగ్..

దూసుకుపోతున్న 'ఆదర్శ కుటుంబం' ట్రైలర్!



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం "ఆదర్శ కుటుంబం.. హౌస్ నెం.47". ఎంతోకాలంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న ఈ క్రేజీ కాంబినేషన్ నుంచి వచ్చిన ట్రైలర్ ఇప్పుడు యూట్యూబ్‌లో సంచలనం సృష్టిస్తోంది. అక్టోబరు 23న విడుదలైన ఈ ట్రైలర్, రిలీజైన కొద్ది గంటల్లోనే యూట్యూబ్ ట్రెండింగ్‌లో అగ్రస్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది.వెంకటేశ్ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'పై ముందు నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. కుటుంబ కథా చిత్రాలకు పెట్టింది పేరైన వెంకటేశ్, తనదైన శైలిలో ఫ్యామిలీ ఎమోషన్స్‌ను యాక్షన్‌తో మిక్స్ చేసే త్రివిక్రమ్ కలవడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ ట్రైలర్ ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది.ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్, డింపుల్ హయతి నటిస్తున్నారు. నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. రవి కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ప్రస్తుతం ట్రైలర్ ట్రెండింగ్‌తో సోషల్ మీడియాలో 'ఆదర్శ కుటుంబం' హ్యాష్‌ట్యాగ్స్ మారుమోగిపోతున్నాయి. ట్రైలర్ సాధించిన ఈ అద్భుత విజయంతో సినిమా యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది. అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL) 9866330400 prajaveekshanam@gmail.com